www.udyamakeratam.com

RNI: TGTEL/25/A0273

1వ వార్షికోత్సవం

# ఉద్యమ కెరటం

నిజం రక్షతి రక్షిత:

UDYAMA KERATAM TELUGU DAILY

తెలుగు దినపత్రిక

| ఆసిఫాబాద్ | | సంపుటి: 2 | | సంచిక: 60 | | 9-8-2026 | | ఆదివారం | | పేజీలు: 8 | | వెల : రూ.2/- |

## పేపర్ లీక్‌పై విద్యార్థుల పట్టు

- జార్ఖండ్‌లో 15 రోజులుగా కొనసాగుతున్న నిరాహార దీక్ష
- ప్రభుత్వంతో రెండో దఫా చర్చలు.. సానుకూల స్పందన
- 14వ జేపీఎస్‌సీ ప్రిలిమినరీ పరీక్ష రద్దుకు డిమాండ్



4

## హనీట్రాప్‌లో వింగ్ కమాండర్!

- పాక్ మహిళ వలలో చిక్కి కీలక సమాచారం చేరవేసినట్లు ఆరోపణ
- సైనిక కదలికల వివరాలు, ఫొటోలు డిజిటల్‌గా పంపినట్లు అనుమానం
- సహోద్యోగి ఫోన్‌లో స్పైవేర్ అమర్చినట్లు దర్యాప్తులో వెల్లడి
- అదుపులోకి తీసుకున్న ఢిల్లీ పోలీసులు



4

## మహిళా బిల్లుపై మాటల మంటలు

- కేంద్రమంత్రి కిరణ్ రిజిజుకు రాహుల్ గాంధీ కౌంటర్
- మూడేళ్లుగా అమలెందుకు లేదన్న రాహుల్
- పునర్విభజనతో ముడిపెట్టడంపై కాంగ్రెస్ నేత ప్రశ్న

4





# సాగునీటి ప్రాజెక్టులకు రూ.5 వేల కోట్లు

- భూసేకరణ, పునరావాస పనులకు నిధుల కొరత రానివ్వం
- ఇప్పటికే రూ.2 వేల కోట్లు విడుదల.. మరో రూ.3 వేల కోట్లు ప్రక్రియలో
- మిడ్‌మానేరు ఎడమ కాలువ పనులు వెంటనే పునఃప్రారంభించాలి
- ఆగస్టు చివరికల్లా పత్తిపాక జలాశయం సమగ్ర ప్రాజెక్టు నివేదిక
- కలెక్టర్లకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశాలు

రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ, పునరావాస పనులను వేగవంతం చేసేందుకు ముఖ్యమంత్రి రూ. 5,000 కోట్లను ప్రాధాన్యత క్రమంలో కేటాయించేందుకు హామీ ఇచ్చారని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఇందులో ఇప్పటికే రూ. 2,000 కోట్లు విడుదలయ్యాయని, మిగిలిన రూ. 3,000 కోట్ల విడుదల ప్రక్రియ కొనసాగుతోందని వెల్లడించారు. నిధుల కొరత కారణంతో ఏ ప్రాజెక్టు పనులూ నిలిచిపోకూడదని స్పష్టం చేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో అమలవుతున్న సాగునీటి ప్రాజెక్టులపై శనివారం ఆయన సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఐటీ శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌లతో పాటు ఆయా జిల్లాల కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. భూసేకరణ, అటవీ, పర్యావరణ అనుమతులను యుద్ధపాతిపదికన పరిష్కరించాలని కలెక్టర్లను మంత్రి ఆదేశించారు.

- హైదరాబాద్, ఆగస్టు 8





## పెట్టుబడులకు తెలంగాణ స్వర్గధామం

### 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం

- పారిశ్రామికవేత్తలు, ప్రవాసులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పిలుపు
- భూమి.. నైపుణ్య శక్తి.. నిరంతర విద్యుత్ మన బలం
- హైదరాబాద్, ఫ్యూచర్ సిటీలో డ్రైవర్‌లెస్ కార్లపై దృష్టి
- శాన్‌ఫ్రాన్సిస్కోలో 'వేమో' కారులో ప్రయాణించిన డిప్యూటీ సీఎం



తెలంగాణలో పరిశ్రమల స్థాపనకు, పెట్టుబడులకు అత్యంత అనుకూలమైన వాతావరణం ఉందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. పారిశ్రామిక భూముల లభ్యత, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా, ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు రాష్ట్రానికి ప్రధాన బలాలని ఆయన పేర్కొన్నారు. అమెరికా పర్యటనలో భాగంగా శాన్ ఫ్రాన్సిస్కోలోని భారత కాన్సులేట్ జనరల్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'మీట్ అండ్ గ్రీట్' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. బే ఏరియాకు చెందిన తెలుగు ప్రవాసులు, పారిశ్రామికవేత్తలు, సాంకేతిక నిపుణులతో సమావేశమై తెలంగాణ అభివృద్ధి ప్రయాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

- హైదరాబాద్, ఆగస్టు 8

2



## 150 కొలువులు.. వేలాది మంది పోటీ

- హైడ్రా డ్రైవర్ ఉద్యోగాలకు నిరుద్యోగుల వెల్లువ
- తెల్లవారుజాము నుంచే సరూర్‌నగర్ స్టేడియం వద్ద బారులు
- ఒక్కసారిగా పోటెత్తడంతో తోపులాట.. గందరగోళం
- ఏర్పాట్లు సరిగా లేవంటూ అభ్యర్థుల ఆగ్రహం
- టోకెన్లు ఇచ్చి వెనక్కి పంపిన నిర్వాహకులు

2



## నేడు నర్సంపేటకు కేసీఆర్

ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబ సభ్యులను ఆదివారం నర్సంపేటలో కేసీఆర్ పరామర్శించనున్నారు.

- పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబానికి పరామర్శ
- నల్లబెల్లికి వెళ్లి కుటుంబ సభ్యులకు ఓదార్పు
- పెద్ది కుటుంబానికి రూ.2.25 కోట్ల ఆర్థిక సాయం
- ఇద్దరు పిల్లలకు చెరో రూ.కోటి.. తల్లికి రూ.25 లక్షలు

2

## నేడు, రేపు బోనాల సందడి

### హైదరాబాద్‌లో ట్రాఫిక్ ఆంక్షలు

- లాల్‌దర్వాజా పరిసరాల్లో వాహనాల మళ్లింపు
- చార్మినార్, ఫలక్‌నుమా వైపు నో ఎంట్రీ
- ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని సూచన

2





## కన్నకూతురిపైనే లైంగిక దాడి

- నెలలుగా వేధింపులు.. చివరకు పోలీసులను ఆశ్రయించిన బాలిక
- సనత్‌నగర్‌లో అమానవీయ ఘటన
- పోక్సో కేసు.. నిందితుడి అరెస్టు

2

## క్షుద్ర రాజకీయాలు కాంగ్రెస్‌కే చెల్లు.. మాకు తెలియవు

- నీటి వాటాల్లో తేడా వస్తే మరో ఉద్యమం
- నీళ్లు ఎప్పుడు ఎత్తిపోయాలో కూడా సీఎంకు తెలియదు
- జీఆర్ఎంబీ అజెండాను అంగీకరించడంపై ప్రభుత్వం సమాధానం చెప్పాలి
- మీడియా సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజం

3





## నిరుద్యోగ యువతపై ఇంత కాఠిన్యమా?

- ఉద్యోగం కోసం వస్తే లాఠీలతో సమాధానమా?
- కాంగ్రెస్ అణచివేతకు సరూర్‌నగర్ ఘటనే నిదర్శనం
- 150 పోస్టులకు వేల మంది రావడం నిరుద్యోగ తీవ్రతకు అద్దం
- హామీలు ఏమయ్యాయంటూ రామచందర్‌రావు నిలదీత

3

ఉద్యమ కెరటం
నిజం రక్షతి రక్షితః UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక




# 150 కొలువులు.. వేలాది మంది పోటీ

**హైడ్రా డ్రైవర్ ఉద్యోగాలకు నిరుద్యోగుల వెల్లువ**

**తెల్లవారుజాము నుంచే సరూర్‌నగర్ స్టేడియం వద్ద బారులు**

**ఒక్కసారిగా పోటెత్తడంతో తోపులాట.. గందరగోళం**

**ఏర్పాట్లు సరిగా లేవంటూ అభ్యర్థుల ఆగ్రహం**

**టోకెన్లు ఇచ్చి వెనక్కి పంపిన నిర్వాహకులు**

**హైదరాబాద్, ఆగస్టు 8:** కొలువు కోసం నిరుద్యోగులు పోటెత్తారు. పోస్టులు కేవలం 150.. కానీ వాటి కోసం వేలాది మంది తరలివచ్చారు. దీంతో హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియం శనివారం నిరుద్యోగ యువతతో కిక్కిరిసిపోయింది. హైడ్రాలో డ్రైవర్ పోస్టుల భర్తీకి నిర్వహించిన ఎంపిక ప్రక్రియలో ఒక్కసారిగా భారీ సంఖ్యలో అభ్యర్థులు రావడంతో తోపులాట చోటుచేసుకుంది. పరిస్థితి కొంత ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు రంగంలోకి దిగి అదుపులోకి తీసుకొచ్చారు. హైడ్రాలో ఖాళీగా ఉన్న 150 డ్రైవర్ పోస్టుల కోసం శనివారం, ఆదివారం ఎంపికలు నిర్వహిస్తామని అధికారులు ప్రకటించారు. దీంతో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వేలాది మంది నిరుద్యోగ యువత సరూర్‌నగర్ స్టేడియానికి తరలివచ్చారు. కొందరు శనివారం తెల్లవారుజామున 4 గంటల నుంచే స్టేడియం వద్దకు చేరుకుని బారులు తీరారు. అంచనాలకు మించి అభ్యర్థులు రావడంతో స్టేడియం పరిసరాలు కిక్కిరిసిపోయాయి. ఎంపిక ప్రక్రియలో ముందుకు వెళ్లేందుకు అభ్యర్థులు ఒక్కసారిగా ప్రయత్నించడంతో తోపులాట జరిగింది. కొద్దిసేపు గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి.

**గంటల తరబడి నిరీక్షణ**

ఉద్యోగం కోసం దూర ప్రాంతాల నుంచి వచ్చిన అభ్యర్థులు గంటల తరబడి వరుసల్లో వేచి ఉండాల్సి వచ్చింది. భారీ సంఖ్యలో అభ్యర్థులు వస్తారని తెలిసినా అందుకు తగిన ఏర్పాట్లు చేయలేదని పలువురు నిరుద్యోగులు అసహనం వ్యక్తం చేశారు. కనీసం తాగునీటి సదుపాయం కూడా సరిగా కల్పించలేదని ఆరోపిస్తూ నిర్వాహకుల తీరుపై ఆందోళనకు దిగారు. జిల్లాలు దాటి ఉద్యోగం కోసం వస్తే ఎంపిక ప్రక్రియను క్రమబద్ధంగా నిర్వహించకుండా ఇబ్బందులకు గురిచేశారని పలువురు అభ్యర్థులు వాపోయారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో స్థానిక పోలీసులు స్టేడియం వద్దకు చేరుకుని అభ్యర్థులను నియంత్రించారు.

**టోకెన్లతో క్రమబద్ధీకరణ**

అభ్యర్థుల రద్దీని తగ్గించేందుకు చివరకు టోకెన్ విధానాన్ని అమలు చేసినట్లు సమాచారం. అభ్యర్థులకు నిర్ణీత సమయంతో కూడిన టోకెన్లు ఇచ్చి వెనక్కి పంపిస్తున్నారు. టోకెన్‌పై పేర్కొన్న సమయానికి తిరిగి వచ్చి ఎంపిక ప్రక్రియలో పాల్గొనాలని నిర్వాహకులు సూచిస్తున్నారు. ఆదివారం కూడా ఎంపిక ప్రక్రియ కొనసాగనున్న నేపథ్యంలో మరింత రద్దీ ఏర్పడకుండా అధికారులు అదనపు ఏర్పాట్లు చేపడుతున్నారు.

# కన్నకూతురిపైనే తండ్రి లైంగిక దాడి

**నెలలుగా వేధింపులు.. పోలీసులను ఆశ్రయించిన బాలిక**

**సనత్‌నగర్‌లో అమానవీయ ఘటన**

**పోక్సో కేసు నమోదు.. నిందితుడి అరెస్టు**

**హైదరాబాద్, ఆగస్టు 8:** కంటికి రెప్పలా కాపాడాల్సిన కన్నతండ్రే కుమార్తెపై లైంగిక దాడికి పాల్పడిన అమానవీయ ఘటన హైదరాబాద్‌లోని సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వెలుగుచూసింది. నెలలుగా వేధింపులను భరించిన బాలిక చివరకు పోలీసులను ఆశ్రయించడంతో విషయం బయటపడింది. పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి 45 ఏళ్ల నిందితుడిని అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిందితుడు భార్య, ముగ్గురు కుమార్తెలతో కలిసి సనత్‌నగర్ ప్రాంతంలో నివాసముంటూ హౌస్‌కీపింగ్ పనులు చేస్తున్నాడు. మద్యానికి బానిసైన అతడు తరచూ భార్య, పిల్లలతో గొడవ పడుతుండేవాడని పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో తన రెండో కుమార్తెపై మార్చి, ఏప్రిల్, మే నెలల్లో పలుమార్లు లైంగిక దాడికి పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. విషయం బయటకు తెలిస్తే కుటుంబ పరువు పోతుందనే భయంతో తొలుత ఫిర్యాదు చేయలేదని సమాచారం. అయితే వేధింపులు ఆగకపోవడంతో బాధిత బాలిక ధైర్యం చేసి సనత్‌నగర్ పోలీసులను ఆశ్రయించింది. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడిపై పోక్సో చట్టంతో పాటు సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. ఘటనపై తదుపరి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.



# సాగునీటి ప్రాజెక్టులకు రూ.5 వేల కోట్లు

- భూసేకరణ, పునరావాస పనులకు నిధుల కొరత రానివ్వం
- ఇప్పటికే రూ.2 వేల కోట్లు విడుదల.. మరో రూ.3 వేల కోట్లు ప్రక్రియలో
- మిడ్‌మానేరు ఎడమ కాలువ పనులు వెంటనే పునఃప్రారంభించాలి
- ఆగస్టు చివరికల్లా పత్తిపాక జలాశయం సమగ్ర ప్రాజెక్టు నివేదిక
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశాలు



**హైదరాబాద్, ఆగస్టు 8:** రాష్ట్రంలో భూసేకరణ, పునరావాసం, అటవీ, పర్యావరణ అనుమతుల కారణంగా నిలిచిపోయిన సాగునీటి ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ, పునరావాసం, పునరావాస స్థిరీకరణ పనుల కోసం రూ.5 వేల కోట్లను ప్రాధాన్యతపై కేటాయిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చినట్లు నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. ఇందులో ఇప్పటికే రూ.2 వేల కోట్లు విడుదలయ్యాయని, మిగిలిన రూ.3 వేల కోట్ల విడుదల ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో అమలవుతున్న సాగునీటి ప్రాజెక్టులపై శనివారం మంత్రి సమగ్ర సమీక్ష నిర్వహించారు. భూసేకరణ, పునరావాసం, అటవీ, పర్యావరణ అనుమతుల సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్లు, నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. పూర్తికి చేరువలో ఉన్న ప్రాజెక్టులు నిధుల కొరత కారణంగా నిలిచిపోవడానికి వీల్లేదని స్పష్టం చేశారు. ఈ సమీక్షలో వ్యవసాయ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో పాటు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ప్రాజెక్టుల భూసేకరణకు అవసరమైన నిధుల వివరాలను కలెక్టర్లు వెంటనే ప్రభుత్వానికి పంపించి, అవసరమైన అనుమతులు పొందాలని ఉత్తమ్ సూచించారు. సాధ్యమైన చోట ఇంజినీరింగ్ పనులతో సమాంతరంగా భూయజమానులకు పరిహారం చెల్లింపు, నిర్వాసిత కుటుంబాల పునరావాస ప్రక్రియను కొనసాగించాలన్నారు. ఇప్పటికే భారీగా ప్రజాధనం వెచ్చించిన ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేసి రైతులకు సాగునీటి ప్రయోజనాలు అందించడంపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి పెట్టారని చెప్పారు. సుమారు నాలుగున్నరేళ్లుగా నిలిచిపోయిన మిడ్‌మానేరు ఎడమ కాలువ మిగులు పనులను వెంటనే పునఃప్రారంభించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. భూసంబంధ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని చెప్పారు. సవరించిన అంచనాలు, భూసేకరణ, టెండర్లు, చట్టబద్ధ అనుమతుల ప్రక్రియలను ఒకేసారి ముందుకు తీసుకెళ్లాలని స్పష్టం చేశారు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలో ప్రతిపాదించిన శ్రీలక్ష్మీనరసింహస్వామి పత్తిపాక జలాశయం పనులను వేగవంతం చేయాలని ఉత్తమ్ ఆదేశించారు. ఈ ప్రాజెక్టు ద్వారా కొత్తగా 10 వేల ఎకరాలకు సాగునీరు అందించడంతో పాటు కాకతీయ ప్రధాన కాలువ పరిధిలోని డి-83 నుంచి డి-94 వరకు సుమారు 2.40 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ధర్మపురి, చొప్పదండి, పెద్దపల్లి, రామగుండం, మంథని నియోజకవర్గాలకు ఈ ప్రాజెక్టుతో ప్రయోజనం చేకూరనుంది. పత్తిపాక వద్ద మూడు టీఎంసీలు, ఐదు టీఎంసీల సామర్థ్యంతో రెండు ప్రత్యామ్నాయ ప్రతిపాదనలను అధికారులు పరిశీలిస్తున్నారు. లైడార్ సర్వే, సమాచార విశ్లేషణ పూర్తయ్యాయని, బోర్‌హోల్ డ్రిల్లింగ్, ట్రయల్ పిట్స్, భూసాంకేతిక పరిశోధనలు కొనసాగుతున్నాయని అధికారులు వివరించారు. ఆగస్టు చివరికల్లా సమగ్ర ప్రాజెక్టు నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తామని తెలిపారు. జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండలంలోని రోళ్లవాగు ప్రాజెక్టుపైనా సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఇప్పటికే 96 శాతం పనులు పూర్తయిన ఈ ప్రాజెక్టు నిల్వ సామర్థ్యాన్ని ప్రస్తుతం ఉన్న 0.250 టీఎంసీల నుంచి సుమారు 0.949 టీఎంసీలకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. తద్వారా చివరి ఆయకట్టు ప్రాంతంలోని దాదాపు 15 వేల ఎకరాలకు సాగునీరు అందించనున్నారు. మూడు కట్టలు, మిగులు నీటి ప్రవాహ నిర్మాణం, ప్రధాన తూముల పనులు దాదాపుగా పూర్తయ్యాయి. రెండో కట్టలో కొంత భాగం అటవీ భూమిలో ఉండటంతో అటవీ అనుమతి రావాల్సి ఉంది. ప్రత్యామ్నాయ అటవీకరణ కోసం అవసరమైన భూమిని ఇప్పటికే గుర్తించగా, వన్యప్రాణుల సంరక్షణ ప్రణాళికకు కూడా అనుమతి లభించినట్లు అధికారులు వివరించారు. ప్రతి సాగునీటి ప్రాజెక్టులో పెండింగ్‌లో ఉన్న భూసేకరణ, పునరావాసం, అటవీ, పర్యావరణ అనుమతులపై విడివిడిగా జాబితా రూపొందించాలని ఉత్తమ్ ఆదేశించారు. అవసరమైన నిధులు, ప్రస్తుతం ఏ దశలో ఉందన్న వివరాలు, పరిష్కారానికి నిర్దేశించిన గడువును అందులో స్పష్టంగా పేర్కొనాలన్నారు. ప్రజాప్రతినిధులు లేవనెత్తిన ప్రతి అంశాన్ని కార్యాచరణ ప్రణాళికగా మార్చి, తదుపరి సమీక్షకు చర్యల నివేదిక సమర్పించాలని స్పష్టం చేశారు. "భూసేకరణ, పునరావాసం లేదా అటవీ అనుమతుల కారణంగా ఏ ప్రాజెక్టు నిలిచిపోయినా ప్రతిపాదనలను వెంటనే పంపండి. నిధులకు ప్రాధాన్యత ఇస్తాం. ప్రాజెక్టులను పూర్తి చేసి నిర్దేశిత ఆయకట్టుకు మరింత ఆలస్యం లేకుండా నీరందించడమే ప్రభుత్వ లక్ష్యం" అని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. సమీక్షలో నాలుగు జిల్లాల కలెక్టర్లు, ఇంజినీర్ జనరల్ ఓవీ రమేశ్‌బాబు, నీటిపారుదల శాఖ సంయుక్త కార్యదర్శి కె.శ్రీనివాస్‌తో పాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పెట్టుబడులకు తెలంగాణ స్వర్గధామం

**3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం**

**పారిశ్రామికవేత్తలు, ప్రవాసులకు భట్టి పిలుపు**

**భూమి.. నైపుణ్య శక్తి.. నిరంతర విద్యుత్ మన బలం**

**హైదరాబాద్, ఫ్యూచర్ సిటీలో డ్రైవర్‌లెస్ కార్లపై దృష్టి**



**హైదరాబాద్, ఆగస్టు 8:** పారిశ్రామిక పెట్టుబడులకు తెలంగాణలో అపార అవకాశాలు ఉన్నాయని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. పరిశ్రమలకు అవసరమైన భూములు, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, నాణ్యమైన నిరంతర విద్యుత్, ప్రపంచస్థాయి మౌలిక వసతులు రాష్ట్రానికి ప్రధాన బలాలని పేర్కొన్నారు. తెలంగాణ ఆర్థిక వ్యవస్థను 3 ట్రిలియన్ డాలర్ల స్థాయికి తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పారిశ్రామికవేత్తలు, ప్రవాస తెలంగాణవాసులు రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అమెరికా పర్యటనలో భాగంగా శాన్‌ఫ్రాన్సిస్కోలో భారత కాన్సులేట్ జనరల్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో తెలుగు ప్రవాసులు, పారిశ్రామికవేత్తలు, సాంకేతిక నిపుణులు, బే ఏరియా వృత్తి నిపుణులతో భట్టి సమావేశమయ్యారు. దేశంలోనే అత్యంత ఆకర్షణీయమైన పెట్టుబడుల గమ్యస్థానంగా తెలంగాణను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందని వివరించారు.

**పరిశ్రమలకు అన్నీ సిద్ధం**

తయారీ, సమాచార సాంకేతికత, జీవశాస్త్రాలు, స్వచ్ఛ ఇంధనం సహా వివిధ రంగాల్లో పెట్టుబడుల కోసం పారిశ్రామిక కారిడార్లు, పార్కుల్లో అవసరమైన భూములను అందుబాటులో ఉంచుతున్నట్లు భట్టి తెలిపారు. భవిష్యత్ పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యం కలిగిన మానవ వనరులను సిద్ధం చేసేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీతో పాటు విద్యా, సాంకేతిక సంస్థలను మరింత బలోపేతం చేస్తున్నామని చెప్పారు. పరిశ్రమలకు 24 గంటలూ నాణ్యమైన విద్యుత్ అందించే సామర్థ్యం తెలంగాణకు ఉందన్నారు. సంప్రదాయ విద్యుత్ ఉత్పత్తితో పాటు పునరుత్పాదక ఇంధన రంగంలోనూ రాష్ట్రం వేగంగా ముందుకు సాగుతోందని వివరించారు. పెట్టుబడిదారులకు అనుమతుల్లో జాప్యం లేకుండా ఏకగవాక్ష విధానాన్ని పటిష్టంగా అమలు చేస్తూ పరిశ్రమల అనుకూల వాతావరణాన్ని కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

**ఫ్యూచర్ సిటీతో కొత్త తెలంగాణ**

అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, ప్రపంచస్థాయి మౌలిక వసతులు, పర్యావరణహిత పట్టణ ప్రణాళికల సమ్మేళనంగా ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేస్తున్నామని భట్టి తెలిపారు. ప్రపంచస్థాయి సంస్థలు, భారీ పెట్టుబడులను తెలంగాణకు ఆకర్షించడంలో ఫ్యూచర్ సిటీ కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. సమాచార సాంకేతికత, ఔషధ రంగం, హరిత ఇంధనం, అధునాతన తయారీ, విజ్ఞాన ఆధారిత పరిశ్రమలను ప్రోత్సహిస్తూ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 3 ట్రిలియన్ డాలర్ల స్థాయికి చేర్చే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ప్రవాస తెలంగాణవాసులు కేవలం పెట్టుబడులతోనే కాకుండా సాంకేతిక పరిజ్ఞానం, ఆవిష్కరణలు, పరిశ్రమల విస్తరణలోనూ రాష్ట్రానికి భాగస్వాములు కావాలని కోరారు.

**డ్రైవర్ లేకుండానే భట్టి ప్రయాణం**

అమెరికా పర్యటనలో భాగంగా శాన్‌ఫ్రాన్సిస్కోలో అత్యాధునిక స్వయంచాలక 'వేమో' కారులో భట్టి విక్రమార్క ప్రయాణించారు. డ్రైవర్ అవసరం లేకుండా కృత్రిమ మేధ, సెన్సర్లు, అత్యాధునిక మ్యాపింగ్ వ్యవస్థల ఆధారంగా నడిచే వాహనం పనితీరును ప్రత్యక్షంగా పరిశీలించారు. అనంతరం వేమో ప్రతినిధులతో సమావేశమై స్వయంచాలక వాహన సాంకేతికతపై చర్చించారు. ఈ వాహనాల నిర్వహణకు అవసరమైన మౌలిక వసతులు, చట్టపరమైన అనుమతులు, నియంత్రణ విధానాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

**హైదరాబాద్‌లో ప్రయోగాత్మకంగా..?**

హైదరాబాద్‌తో పాటు ప్రతిపాదిత ఫ్యూచర్ సిటీలో స్వయంచాలక రవాణా వ్యవస్థలను ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టే అవకాశాలను భట్టి పరిశీలించారు. ఇందుకు అవసరమైన అత్యంత స్పష్టత కలిగిన డిజిటల్ మ్యాపింగ్, సెన్సర్లకు అనుకూలమైన రహదారులు, ప్రత్యేక పరీక్షా మార్గాలు, వేగవంతమైన సమాచార అనుసంధానం, కృత్రిమ మేధ గణన మౌలిక వసతులపై వేమో ప్రతినిధులతో చర్చించారు. స్వయంచాలక వాహనాల ప్రయోగాలకు అవసరమైన విధానాలు, నియంత్రణ వ్యవస్థలు, భవిష్యత్తులో వాటిని విస్తరించేందుకు చేపట్టాల్సిన చర్యలపైనా సమావేశంలో చర్చ జరిగింది. హైదరాబాద్, ఫ్యూచర్ సిటీ పట్టణాభివృద్ధి ప్రణాళికల్లో భవిష్యత్ రవాణా సాంకేతికతను భాగం చేసి, అత్యాధునిక రవాణా పరిష్కారాల్లో తెలంగాణను అగ్రస్థానంలో నిలపాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

# నేడు నర్సంపేటకు కేసీఆర్

## పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబానికి పరామర్శ

- నల్లబెల్లికి వెళ్లి కుటుంబ సభ్యులకు ఓదార్పు
- పెద్ది కుటుంబానికి రూ.2.25 కోట్ల ఆర్థిక సాయం

**వరంగల్, ఆగస్టు 8:** బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదివారం నర్సంపేట నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన పార్టీ సీనియర్ నేత పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించనున్నారు. పెద్ది స్వగ్రామమైన నల్లబెల్లికి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చి, వారికి భరోసా కల్పించనున్నారు. బీఆర్ఎస్ ఆవిర్భావం నుంచి పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసిన పెద్ది సుదర్శన్‌రెడ్డి.. కేసీఆర్‌కు ముఖ్య అనుచరుడిగా కొనసాగారు. ఆయన ఆకస్మిక మరణంతో తీవ్ర విషాదానికి గురైన కేసీఆర్, తన ఆప్తుడి కుటుంబానికి పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని ఇప్పటికే ప్రకటించారు. ఈ నేపథ్యంలో స్వయంగా నల్లబెల్లికి వెళ్లి పెద్ది కుటుంబ సభ్యులను పరామర్శించనున్నారు. ఈ సందర్భంగా నర్సంపేట నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, పెద్ది అభిమానులతోనూ కేసీఆర్ మాట్లాడే అవకాశం ఉంది. సుదర్శన్‌రెడ్డి లేని లోటుతో ఆవేదనలో ఉన్న పార్టీ శ్రేణులకు ధైర్యం చెప్పనున్నారు.

**కుటుంబానికి రూ.2.25 కోట్ల అండ**

పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబానికి బీఆర్ఎస్ తరఫున రూ.2.25 కోట్ల ఆర్థిక సహాయం అందించాలని కేసీఆర్ నిర్ణయించారు. సుదర్శన్‌రెడ్డి ఇద్దరు పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని వారికి చెరో రూ.కోటి చొప్పున అందించనున్నారు. ఆయన తల్లి అమృతమ్మ వృద్ధాప్యంలో ఉన్న నేపథ్యంలో ఆమె బాగోగుల కోసం మరో రూ.25 లక్షలను బ్యాంకులో జమ చేయాలని నిర్ణయించారు. పిల్లల చదువు, భవిష్యత్తుతో పాటు కుటుంబ సంక్షేమాన్ని పార్టీ నిరంతరం పర్యవేక్షిస్తుందని కేసీఆర్ స్పష్టం చేశారు. పార్టీ సీనియర్ నేతలు, వరంగల్ జిల్లా ముఖ్య నాయకులతో చర్చించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు బీఆర్ఎస్ వర్గాలు తెలిపాయి. పెద్ది సుదర్శన్‌రెడ్డి దశదినకర్మలు ముగిసిన అనంతరం జిల్లా ముఖ్య నేతలతో సమావేశమై కుటుంబ సంక్షేమానికి సంబంధించి మరిన్ని నిర్ణయాలు తీసుకోనున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. పెద్ది కుటుంబానికి ఎల్లకాలం బీఆర్ఎస్ అండగా ఉంటుందని కేసీఆర్ పునరుద్ఘాటించారు.



# క్షుద్ర రాజకీయాలు కాంగ్రెస్‌కే చెల్లు..
# మాకు తెలియవు



- నీటి వాటాల్లో తేడా వస్తే మరో ఉద్యమం
- నీళ్లు ఎప్పుడు ఎత్తిపోయాలో కూడా సీఎంకు తెలియదు
- జీఆర్ఎంబీ అజెండాను అంగీకరించడంపై ప్రభుత్వం సమాధానం చెప్పాలి
- మీడియా సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజం

**హైదరాబాద్, ఆగస్టు 8:** తెలంగాణ నీటి హక్కులు, వాటాల విషయంలో ఏమాత్రం తేడా వచ్చినా రాష్ట్రం భగ్గుమంటుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వాన్ని అడ్డుపెట్టుకుని తెలంగాణకు అన్యాయం చేసేందుకు ప్రయత్నిస్తే సహించేది లేదని, అవసరమైతే తెలంగాణ ఉద్యమానికి మించిన ఆందోళనకు సిద్ధమవుతామని స్పష్టం చేశారు. నీళ్లు ఎప్పుడు ఎత్తిపోసుకోవాలో కూడా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి తెలియడం లేదని విమర్శించారు. హైదరాబాద్‌లోని నందినగర్‌లో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. కాంగ్రెస్ నేతలు క్షుద్రపూజల పేరుతో ఆరోపణలు చేస్తూ క్షుద్ర రాజకీయాలకు పాల్పడుతున్నారని కేటీఆర్ మండిపడ్డారు. "తెలంగాణ కోసం కొట్లాడిన వాళ్లం.. త్యాగాలు చేసిన వాళ్లం. అధికారంలో ఉన్నా, లేకున్నా తెలంగాణ బాగుండాలనే కోరుకుంటాం. కాంగ్రెస్‌లా క్షుద్ర రాజకీయాలు చేయాల్సిన అవసరం మాకు లేదు" అని వ్యాఖ్యానించారు. హరీశ్‌రావు గుడికి వెళితే తప్పేమిటని ప్రశ్నించారు. మేడిగడ్డ, చెక్‌డ్యామ్‌ల విషయంలో రాజకీయ ప్రయోజనాల కోసం వ్యవహరించలేదని చెప్పారు. రాష్ట్రంలో నీళ్లు అందుబాటులో ఉన్నప్పటికీ రైతులకు అందించడంలో ప్రభుత్వం విఫలమైందని కేటీఆర్ ఆరోపించారు. తాము డిమాండ్ చేసిన తర్వాతే పంపులను ఎందుకు ప్రారంభించారని ప్రశ్నించారు. నార్లాపూర్‌ను ముట్టడించి పంపులు ఆన్ చేస్తామని బీఆర్ఎస్ హెచ్చరించిన తర్వాతే ప్రభుత్వం స్పందించిందన్నారు. "పాలమూరు బిడ్డనని చెప్పుకొనే రేవంత్‌రెడ్డికి పాలమూరు రైతులకు నీళ్లు ఇవ్వాలనే సోయి లేదు. వర్షాలు పడి పక్క రాష్ట్రం నీళ్లు ఎత్తిపోసుకుంటున్నా ముఖ్యమంత్రికి పట్టింపు లేదు. ప్రధాన ప్రతిపక్షం ప్రశ్నిస్తే తప్ప ప్రభుత్వం నిద్రలేవడం లేదు" అని విమర్శించారు.

### జీఆర్ఎంబీ అజెండాపై తీవ్ర అభ్యంతరం

వచ్చేవారం జరగనున్న గోదావరి నదీ యాజమాన్య బోర్డు సమావేశ అజెండాను రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు అంగీకరించిందో ప్రజలకు చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఆ అజెండా తెలంగాణ హక్కులకు నష్టం కలిగించేలా ఉందని ఆరోపించారు. రాష్ట్ర నీటి హక్కులను ఎలా కాపాడతారో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమాధానం చెప్పాలన్నారు. కేంద్రమైనా, రాష్ట్ర ప్రభుత్వమైనా తెలంగాణకు నష్టం కలిగించేలా వ్యవహరిస్తే తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. "కేంద్రాన్ని అడ్డుపెట్టుకుని తెలంగాణ నీటి వాటాల్లో అన్యాయం చేస్తే తెలంగాణ ఉద్యమానికి మించిన ఆందోళన వస్తుంది. నీళ్లు, నిధులు, నియామకాల కోసం సాధించుకున్న తెలంగాణ మరోసారి నీటి దోపిడీకి గురైతే చూస్తూ ఊరుకోం" అని స్పష్టం చేశారు. ప్రభుత్వం తెలంగాణ ప్రయోజనాల విషయంలో చిత్తశుద్ధితో ఉంటే వివాదాస్పద అజెండాతో జరిగే సమావేశాన్ని బహిష్కరించాలని సూచించారు.

### ఆదిత్యనాథ్ దాస్‌ను తొలగించాలి

ఆదిత్యనాథ్ దాస్‌ను రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా నియమించడంపైనా కేటీఆర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తెలంగాణలో సమర్థులైన ఇంజినీర్లు లేరా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రభావంలో నడుస్తోందని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణ ప్రయోజనాల పట్ల చిత్తశుద్ధి నిరూపించుకోవాలంటే ఆదిత్యనాథ్ దాస్‌ను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రైతులకు నిరంతర విద్యుత్ సరఫరా చేస్తున్నామన్న ప్రభుత్వ వాదనను కేటీఆర్ తప్పుబట్టారు. రోజుకు ఐదారు సార్లు విద్యుత్ కోతలు ఉంటున్నాయని ఆరోపించారు. "ఏ సబ్‌స్టేషన్‌కైనా రావడానికి మేం సిద్ధం. రైతులకు నిజంగా 24 గంటల కరెంటు ఎక్కడ ఇస్తున్నారో ప్రభుత్వం చూపించాలి" అని సవాల్ చేశారు.

### హైడ్రా తీరుపైనా విమర్శలు

హైడ్రా విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్ని ప్రజాస్వామికవాదులు గమనించాలని కేటీఆర్ కోరారు. న్యాయస్థానాలు వ్యాఖ్యలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోవడం లేదని ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జీవో 58 ద్వారా రెండున్నర లక్షల మందికి పట్టాలు ఇచ్చామని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క పట్టా కూడా ఇవ్వకపోగా వేలాది ఇళ్లను కూల్చిందని విమర్శించారు. హైదరాబాద్‌లోని విలువైన పారిశ్రామిక భూముల విషయంలో భారీ కుంభకోణం జరుగుతోందని కేటీఆర్ ఆరోపించారు. ప్రభుత్వ భూ విధానాలపై ప్రజలను చైతన్యపరుస్తామని చెప్పారు. ఇందుకు సంబంధించిన వివరాలను లేఖలు, ప్రజెంటేషన్ల రూపంలో ప్రజల ముందుంచుతామని తెలిపారు. రైతులు, సాగునీరు, విద్యుత్, భూముల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై బీఆర్ఎస్ పోరాటాన్ని మరింత ఉద్ధృతం చేస్తుందని కేటీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణ ప్రయోజనాలకు భంగం కలిగించే ఏ నిర్ణయాన్నీ సహించబోమని, ముఖ్యంగా నీటి హక్కుల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు.

# నిరుద్యోగ యువతపై ఇంత కాఠిన్యమా?

- ఉద్యోగం కోసం వస్తే లాఠీలతో సమాధానమా?
- కాంగ్రెస్ అణచివేతకు సరూర్‌నగర్ ఘటనే నిదర్శనం
- 150 పోస్టులకు వేల మంది రావడం నిరుద్యోగ తీవ్రతకు అద్దం
- ఎన్నికల హామీలు ఏమయ్యాయంటూ రామచందర్‌రావు నిలదీత



**హైదరాబాద్, ఆగస్టు 8 :** ఉద్యోగం కోసం ఆశతో వచ్చిన నిరుద్యోగ యువతపై పోలీసులు లాఠీలు ఝుళిపించడం తీవ్ర బాధాకరమని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు మండిపడ్డారు. సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం వద్ద చోటుచేసుకున్న ఘటన రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ అణచివేత ధోరణికి నిదర్శనమని ఆరోపించారు. ఢిల్లీలో రాహుల్‌గాంధీ 'మొహబ్బత్ కీ దుకాణ్' అంటూ ప్రేమ గురించి గొప్పగా మాట్లాడుతుంటే.. తెలంగాణలో మాత్రం ఉపాధి కోరుతున్న యువతపై లాఠీలు ఝుళిపిస్తున్నారని విమర్శించారు. ఉద్యోగాల కోసం వచ్చిన నిరుద్యోగులపై పోలీసులను ప్రయోగించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. హైడ్రాలో కేవలం 150 డ్రైవర్ పోస్టుల కోసం వేలాది మంది యువత తరలిరావడమే రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య ఎంత తీవ్రంగా ఉందో చెప్పడానికి నిదర్శనమని రామచందర్‌రావు పేర్కొన్నారు. ఇది కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి కూడా అద్దం పడుతోందన్నారు. అధికారంలోకి వస్తే జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని, నెలకు రూ.4 వేల నిరుద్యోగ భృతి అందిస్తామని, స్వయం ఉపాధి కోసం రూ.10 లక్షల వరకు వడ్డీలేని రుణాలు ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. రెండేళ్లు గడుస్తున్నా ఆ హామీల్లో ఏ ఒక్కటీ పూర్తిస్థాయిలో అమలు కాలేదని విమర్శించారు. కాంగ్రెస్ హామీలను నమ్మి ఓటేసిన యువతను ఇప్పుడు రోడ్లపాలు చేయడమే కాకుండా, ఉద్యోగం వస్తుందన్న ఆశతో వచ్చిన వారిపై పోలీసులతో దౌర్జన్యం చేయించడం అన్యాయమని రామచందర్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ యువత ఆకాంక్షలను ఆసరాగా చేసుకుని అధికారంలోకి వచ్చారో, అదే యువత భవిష్యత్తును కాంగ్రెస్ ప్రభుత్వం అంధకారంలోకి నెట్టివేస్తోందని ఆరోపించారు. సరూర్‌నగర్‌లో ఉద్యోగ అభ్యర్థులపై జరిగిన పోలీసు చర్యపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ యువతకు, రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిందేనని రామచందర్‌రావు స్పష్టం చేశారు.

# నిరుద్యోగులంటే ఎందుకింత కక్ష

**సరూర్ నరగ్ ఘటన ముమ్మాటికీ ప్రభుత్వ వైఫల్యమే**

**2 లక్షల ఉద్యోగాలు భర్తీ హామీ మోసానికి నిదర్శనం**

**ఎక్స్ వేదికగా మండిపడ్డ బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు**



**హైదరాబాద్, ఆగస్ట్ 8:** హైడ్రాలో డ్రైవర్ పోస్టుల భర్తీకి వచ్చిన నిరుద్యోగులను ప్రభుత్వం అవమానించిందంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. విద్యార్థులు, నిరుద్యోగులు అంటే ప్రభుత్వానికి ఎందుకింత కక్ష అంటూ మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేస్తూ.. 32 నెలలు దాటినా ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదని దుయ్యబట్టారు. రెండు లక్షల ఉద్యోగాల హామీ బోగస్ అయ్యిందంటూ ఫైర్ అయ్యారు. అధికారం కోసం ఎన్నికల సమయంలో విద్యార్థులు, నిరుద్యోగులను నెత్తిన పెట్టుకున్నారు. ఉద్యోగాలు ఇస్తామని హామీలు గుప్పించారు. ఇప్పుడు అదే నిరుద్యోగులు ఉద్యోగాల కోసం రోడ్ల మీదకు వస్తే వారి పట్ల ఇంత కర్కశంగా వ్యవహరిస్తారా అని ప్రశ్నించారు. హైడ్రాలో కేవలం 150 డ్రైవర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇస్తే వేలాది మంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకునేందుకు తరలివచ్చారు. ఇది నిరుద్యోగుల తప్పా లేక ఉద్యోగాలు కల్పించడంలో విఫలమైన మీ ప్రభుత్వం తప్పా అని అన్నారు. ఇంజినీరింగ్ చదివిన విద్యార్థులను ముఖ్యమంత్రి స్థాయిలో 'క్రిమినల్ వేస్ట్' అని అవమానించడం, ఉద్యోగాల కోసం వచ్చిన నిరుద్యోగులను అధికారులు దుర్భాషలాడటం చూస్తుంటే 'యథా రాజా.. తథా అధికారులు' అన్న సామెత గుర్తుకొస్తోంది. అధికారుల నోటివెంట ఇలాంటి మాటలు రావడం మరింత బాధాకరం. ఉద్యోగం కోసం వచ్చిన యువతను గౌరవంగా చూడాల్సిన అధికారులు వారినే అవమానిస్తే ఇక ఈ ప్రభుత్వం ఎవరి కోసం పనిచేస్తున్నట్టు అని అన్నారు. రెండు లక్షల ఉద్యోగాలు నిజంగా భర్తీ చేసి ఉంటే.. ఈరోజు 150 డ్రైవర్ పోస్టుల కోసం వేలాది మంది నిరుద్యోగులు ఇలా క్యూలలో నిలబడాల్సిన పరిస్థితి వచ్చేదా అని అన్నారు. నీ రెండు లక్షల ఉద్యోగాల హామీ బోగస్. నీ జాబ్ క్యాలెండర్ బోగస్. నిరుద్యోగులకు నువ్వు ఇచ్చిన హామీలు బోగస్. మీ పాలనలో ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతలో నిరాశ పెరుగుతోంది. నోటిఫికేషన్లు సక్రమంగా రాకపోవడంతో పీజీ, పీహెచ్డీ వంటి ఉన్నత విద్య చదివిన యువత కూడా చిన్నచిన్న పోస్టుల కోసం పోటీ పడాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఇది ముమ్మాటికీ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం. ఉద్యోగాల కోసం వచ్చిన నిరుద్యోగులపై అనుచితంగా, అసభ్యంగా మాట్లాడిన అధికారులపై వెంటనే క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలి. వారిని అవమానించినందుకు విద్యార్థి, నిరుద్యోగలోకానికి ప్రభుత్వం క్షమాపణ చెప్పాలి' అంటూ ఎక్స్‌లో హరీశ్ రావు పోస్ట్ చేశారు. హైడ్రాలో డ్రైవర్ పోస్టుల భర్తీ సందర్భంగా సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం వద్ద జరిగిన ఘటనలపై హరీశ్ రావు 'ఎక్స్'వేదికగా స్పందించారు. ఇది ముమ్మాటికీ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని.. ఉద్యోగాలు ఇవ్వాల్సిన ప్రభుత్వం ఉద్యోగాలు ఇవ్వడం లేదని పేర్కొన్నారు.



# నేడు, రేపు హైదరాబాద్‌లో బోనాల సందడి

**నగరంలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు**

**లాల్‌దర్వాజా పరిసరాల్లో భారీగా వాహనాల మళ్లింపు**

**చార్మినార్, ఫలక్‌నుమా వైపు భారీ వాహనాలకు నో ఎంట్రీ**

**ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని పోలీసుల సూచన**

**హైదరాబాద్, ఆగస్టు 8:** హైదరాబాద్‌లో బోనాల ఉత్సవాలు ఆగస్టు 9, 10 తేదీల్లో జరగనున్న నేపథ్యంలో నగరంలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు, వాహనాల మళ్లింపులు చేపట్టినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. లాల్‌దర్వాజా, కార్వాన్ దర్బార్ మైసమ్మ, అంబర్‌పేట్ మహంకాళి, చిలకలగూడ కట్ట మైసమ్మ ఆలయాల పరిసరాల్లో భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక ట్రాఫిక్ ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. లాల్‌దర్వాజా బోనాల సందర్భంగా పాతబస్తీలో ఆగస్టు 9న ఉదయం 6 గంటల నుంచి, 10న ఉదయం 9 గంటల నుంచి ఊరేగింపు ముగిసే వరకు ట్రాఫిక్ మళ్లింపులు అమల్లో ఉంటాయని పేర్కొన్నారు. మదీనా ఎక్స్‌రోడ్డు నుంచి చార్మినార్, నాగుల్‌చింత మీదుగా ఇంజిన్‌బౌలి వెళ్లే రహదారిని బోనాల ఊరేగింపు పూర్తయ్యే వరకు మూసివేయనున్నట్లు తెలిపారు. ఆర్టీసీ బస్సులు, భారీ వాహనాలకు చార్మినార్, ఫలక్‌నుమా వైపు ప్రవేశం ఉండదని స్పష్టం చేశారు. కార్వాన్ దర్బార్ మైసమ్మ బోనాల సందర్భంగా ఆగస్టు 8 రాత్రి 9 గంటల నుంచి ఆగస్టు 10 ఉదయం వరకు పురానాపూల్, జియాగూడ, టప్పాచబుత్రా పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయని పోలీసులు తెలిపారు. అంబర్‌పేట్ మహంకాళి ఆలయం వద్ద ఆగస్టు 9 ఉదయం 6 గంటల నుంచి ఆగస్టు 10 మధ్యాహ్నం 12 గంటల వరకు ట్రాఫిక్ మళ్లింపులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. బస్సులు, భారీ వాహనాలు అంబర్‌పేట్ ఫ్లైఓవర్ మీదుగా వెళ్లాలని సూచించారు. చిలకలగూడ కట్ట మైసమ్మ ఆలయం పరిసరాల్లో ఆగస్టు 9, 10 తేదీల్లో ఉదయం 5 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయని తెలిపారు. వాహనాలను సీతాఫల్‌మండి, పద్మారావునగర్ వైపు మళ్లించనున్నట్లు పేర్కొన్నారు. బోనాల సందర్భంగా ఆయా ప్రాంతాల్లో భక్తుల రద్దీ అధికంగా ఉండే అవకాశం ఉన్నందున వాహనదారులు ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని, వీలైనంత వరకు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

# ఫేక్ సర్టిఫికెట్లతో జేఎల్ ఉద్యోగాలు..

**ఉమ్మడి నల్లగొండలో నలుగురికి షోకాజ్ నోటీసులు**

**రామగిరి, ఆగస్టు 8 :** ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నకిలీ సర్టిఫికెట్స్‌తో ఉద్యోగంలో చేరి కొనసాగుతున్న వారి భాగోతం వెలుగు చూసింది. కాంట్రాక్ట్ లెక్చరర్స్ బాధలు చూసిన అప్పటి బీఆర్ఎస్ సర్కార్ జూనియర్ లెక్చరర్స్‌ను రెగ్యూలర్ చేసిన విషయం తెలిసిందే. అయితే వీరిలో పలువురు నకిలీ సర్టిఫికెట్స్‌తో ప్రభుత్వ ఉద్యోగాలు పొందినట్లు ఆ శాఖ అధికారులు గుర్తించారు. వీరు ఇతర రాష్ట్రాలోని పలు యూనివర్సిటీల్లో పీజీ, ఇతర కోర్సులు పూర్తి చేసినట్లు వాటిని ఇంటర్మీడియేట్ బోర్డుకు అందచేసి ఉద్యోగాలు పొందినట్లు తెలుస్తుంది. వీరిని గుర్తించిన ఇంటర్మీడియేట్ బోర్డు రాష్ట్ర వ్యాప్తంగా 37 మందికి షోకాజ్ నోటీసులు జారీ చేసింది. వీరిలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో నలుగురు ఉండటం గమనార్హం. నల్లగొండ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫిజిక్స్ అధ్యాపకురాలు, సూర్యాపేట, కోదాడలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సబ్జెక్టులు బోధించే మహిళా అధ్యాపకురాలు, సూర్యాపేట జిల్లాలోని నేరేడుచర్లలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో బోటని అధ్యాపకుడికి నోటీసులు అందినట్లు సమాచారం. వీరంతా వారం రోజుల్లోగా ఇంటర్మీడియేట్ బోర్డుకు పూర్తి ఆధారాలను సమర్పించాలని నోటీసులో అధికారులు పేర్కొన్నారు. అధ్యాపకులు ఇచ్చే సమాదానం ఆధారంగా వారిపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

# ట్రైనీ ఐపీఎస్ ఉదయ్‌కృష్ణారెడ్డి కేసులో ట్విస్ట్

**హైదరాబాద్:** ట్రైనీ ఐపీఎస్ ఉదయ్‌కృష్ణారెడ్డి కేసు అనేక మలుపులు తిరుగుతోంది. తాజాగా మరో ట్విస్ట్ చోటుచేసుకుంది. సూసైడ్ నోట్, ఆధారాలున్న ఐఫోన్ మాయమయ్యాయి. సూసైడ్ నోట్‌పై సీపీ సజ్జనార్ ప్రశ్నించగా.. తాగిన మైకంలో సూసైడ్ నోట్ రాశానన్న ఉదయ్.. ఆ నోట్ ఎక్కడ ఉందో తెలియదన్నారు. కస్టడీలో తమని తప్పుదోవ పట్టించాడని పోలీసులు చెబుతున్నారు. దీంతో మరో సెక్షన్ జోడించాలని పోలీసులు నిర్ణయించినట్లు సమాచారం. కాగా, ఉదయ్ కృష్ణారెడ్డి కోర్టులో సంచలన ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. పోలీస్ కస్టడీ ముగియడంతో అత్తాపూర్ పోలీసులు ఆయనను ఉప్పరపల్లి మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. ఈ సందర్భంగా కోర్టు హాలులోనే ఉదయ్ కృష్ణారెడ్డి బోరున విలపించారు. సైబరాబాద్ సీపీ సజ్జనార్‌పై ఆయన మేజిస్ట్రేట్‌కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. విచారణ పేరుతో తనను సీపీ సజ్జనార్ తీవ్రంగా బెదిరించారని, 'నిన్ను ఎన్‌కౌంటర్ చేస్తాం' అంటూ అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారంటూ ఉదయ్ ఆరోపించారు. అలాగే తన విచారణను వీడియో రికార్డింగ్ చేయలేదని.. తనను విచారించిన గదిలో సీసీ కెమెరాలు లేవని తెలిపినట్టు సమాచారం. ఉదయ్ కృష్ణారెడ్డి కస్టడీ శుక్రవారం సాయంత్రం ముగిసింది. రెండు రోజులపాటు పోలీసులు అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో విచారించారు. ఉమెన్ సేఫ్టీ వింగ్ డీసీపీ లావణ్యతో పాటు కేసును విచారిస్తున్న ఇన్‌స్పెక్టర్ జోష్ణ, అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ సీతయ్య ఆధ్వర్యంలో విచారించారు. గురువారం రాత్రి హైదరాబాద్ కమీషనర్ సజ్జనార్ స్వయంగా వచ్చి దాదాపు మూడు గంటల పాటు విచారణలో పాల్గొన్నారు. విచారణ గడువు ముగియడంతో పోలీసులు మెజిస్ట్రేట్ ముందు హాజరపరిచారు.

ఉద్యమ కెరటం
UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక
ఆదివారం
9 ఆగస్టు 2026

## సంపాదకీయం



# అడవితల్లి ఒడిలో ఆదిమ సంస్కృతి

## నేడే ప్రపంచ ఆదివాసి దినోత్సవం

జల, జంగల్, జమీన్ నినాదంతో అడవితల్లిని ప్రాణంగా భావించి పూజించే ఆదివాసీల జీవన విధానం మానవాళికి ఎల్లప్పుడూ ఆదర్శనీయమైనది. పచ్చని చెట్లు, పారే ఏరులు, ఎత్తైన కొండల నడుమ ప్రకృతితో మమేకమై జీవించే ఆదివాసీలు ఈ భూమిపై తొలి మానవ సమూహాలు. ప్రకృతికి ఎటువంటి హాని తలపెట్టకుండా, సమాజ సమతుల్యతను కాపాడటంలో వారి పాత్ర అమూల్యమైనది. ప్రతి సంవత్సరం ఆగస్టు 9న జరుపుకునే ప్రపంచ ఆదివాసి దినోత్సవం, ఆదివాసీల గొప్ప సంస్కృతిని స్మరించుకోవడంతో పాటు వారి హక్కుల పరిరక్షణ సమస్యల పరిష్కారం కోసం గొంతు విప్పే ఒక చారిత్రాత్మక సందర్భం.

### ప్రపంచ ఆదివాసి దినోత్సవ నేపథ్యం

ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో 1982 ఆగస్టు 9న స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో ఆదివాసీల మానవ హక్కులపై మొదటి అంతర్జాతీయ సమావేశం జరిగింది. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లో నివసిస్తున్న ఆదివాసీలు ఎదుర్కొంటున్న వేధింపులు, విస్థాపన, హక్కుల కాలరాచివేత వంటి సమస్యలపై ప్రపంచ దేశాల దృష్టిని మరల్చడానికి ఈ సమావేశం పునాది వేసింది. అనంతరం, ఆదివాసీ సమాజాల విశిష్ట గుర్తింపును గౌరవిస్తూ, వారి హక్కులను రక్షించాలనే లక్ష్యంతో ఐక్యరాజ్యసమితి సాధారణ సభ 1994లో ప్రతి సంవత్సరం ఆగస్టు 9వ తేదీని ప్రపంచ ఆదివాసి దినోత్సవంగా అధికారికంగా ప్రకటించింది. నాటి నుంచి ప్రపంచవ్యాప్తంగా ఆదివాసీ తెగలు తమ ఉనికిని, పోరాట పటిమను చాటుకుంటూ ఈ దినోత్సవాన్ని ఉత్సాహంగా నిర్వహించుకుంటున్నారు.

### ప్రకృతి పరిరక్షణలో ముందుండే పర్యావరణ రక్షకులు

ఆదివాసీలు కేవలం అడవులలో నివసించే ప్రజలు మాత్రమే కాదు, ప్రకృతికి నిజమైన సంరక్షకులు. ఆధునిక ప్రపంచం కార్పొరేట్ వ్యామోహంలో పడి పర్యావరణాన్ని ధ్వంసం చేస్తున్న నేటి కాలంలో, ఆదివాసీల సాంప్రదాయ జీవన శైలి పర్యావరణ సమతుల్యతకు దిక్సూచిలా నిలుస్తోంది. వారు అడవి నుంచి తమకు కావాల్సిన పరిమిత ఫలాలను మాత్రమే స్వీకరిస్తారు తప్ప, ప్రకృతికి ఎలాంటి వినాశనం కలిగించరు. వృక్ష సంపదను, జంతుజాలాన్ని దైవంగా భావించి పూజించే ఆచారం వారి సంస్కృతిలోనే భాగమైంది. ప్రపంచంలో అత్యధిక జీవవైవిధ్యం కలిగిన దట్టమైన అటవీ ప్రాంతాలన్నీ ఆదివాసీల రక్షణలోనే సురక్షితంగా ఉన్నాయని పలు అంతర్జాతీయ సర్వేలు కూడా స్పష్టం చేస్తున్నాయి. తరతరాలుగా వస్తున్న మూలికా వైద్య పరిజ్ఞానం, ప్రకృతి ఆధారిత వ్యవసాయ పద్ధతులు ఆదివాసీల జ్ఞాన సంపదకు నిదర్శనం.

### పోరాటాల గడ్డపై హక్కుల కోసం ఎగసిన విప్లవ జ్వాలలు

ఆదివాసీల చరిత్ర త్యాగాలకు, వీరత్వానికి ప్రతీక. తమ నేలను, అడవిని, ఆత్మగౌరవాన్ని కాపాడుకోవడానికి ఆదివాసీ వీరులు చూపిన ధైర్యసాహసాలు భారత స్వాతంత్ర్య సంగ్రామంలో సువర్ణాక్షరాలతో లిఖించబడ్డాయి. నిజాం నవాబుల అణచివేతకు, భూస్వాముల దోపిడీకి వ్యతిరేకంగా "జల్, జంగల్, జమీన్" నినాదంతో సమరశంఖం పూరించిన అమరవీరుడు కొమురం భీమ్ ఆసిఫాబాద్ పోరాట వేదికగా ఆదివాసీల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచారు. జార్ఖండ్ గడ్డపై బ్రిటిష్ దోపిడీ పాలనకు వ్యతిరేకంగా ఆదివాసీలను ఏకం చేసి పోరాడిన భగవాన్ బిర్సా ముండా, మన్యం పోరాటంలో అల్లూరి సీతారామరాజుకు అండగా నిలిచి బ్రిటిష్ సైన్యాలను గడగడలాడించిన గాం గంటందొర, మరియు రాంజీ గోండ్ వంటి అనేకమంది యోధులు ఆదివాసీల వీరత్వానికి, స్వేచ్ఛాప్రియత్వానికి నిదర్శనాలుగా నిలిచారు.

### నేటి ఆధునిక సమాజంలో ఆదివాసీల సమస్యలు

శాస్త్ర సాంకేతిక రంగాలు విపరీతంగా పురోగమిస్తున్నప్పటికీ, ఆదివాసీ సమాజాలు నేటికీ అనేక ప్రాథమిక సమస్యలతో పోరాడుతుండటం విచారకరం. అభివృద్ధి ప్రాజెక్టులు, గనుల తవ్వకాలు, మరియు అడవుల విస్తరణ పేరుతో వేలాది ఆదివాసీ కుటుంబాలు తమ సొంత నెలవులను కోల్పోయి విస్థాపనకు గురవుతున్నాయి. 2006 అటవీ హక్కుల చట్టం అందుబాటులోకి వచ్చినప్పటికీ, సాగు చేసుకుంటున్న పోడు భూములకు పూర్తిస్థాయిలో హక్కు పత్రాలు (పట్టాలు) అందక గిరిజనులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మారుమూల గూడాలలో నాణ్యమైన విద్య, అత్యవసర వైద్య సదుపాయాలు, రవాణా, తాగునీరు వంటి మౌలిక వసతులు నేటికీ మృగ్యంగానే ఉన్నాయి. వీటితో పాటు మాతృభాషలకు ప్రాధాన్యత తగ్గడం వల్ల గుస్సాడీ, దండారీ వంటి విలక్షణమైన సాంస్కృతిక రూపాలు, ప్రత్యేక భాషలు కాలక్రమేణా అంతరించిపోయే ప్రమాదంలో పడుతున్నాయి.

### హక్కుల పరిరక్షణతోనే సమగ్ర వికాసం

ఆదివాసీల సమగ్ర అభివృద్ధి సాధించడమంటే వారి సంస్కృతిని, స్వచ్ఛమైన జీవన విధానాన్ని విచ్ఛిన్నం చేయడం కాదని గ్రహించాలి. వారి ఆత్మగౌరవానికి భంగం కలగకుండా, వారి ఆచార వ్యవహారాలను గౌరవిస్తూనే సంక్షేమ పథకాలను అందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. గిరిజన ప్రాంతాల్లో అటవీ హక్కుల చట్టాన్ని పటిష్టంగా అమలు చేసి రైతులకు భూ హక్కులు కల్పించాలి. మారుమూల ఏజెన్సీ ప్రాంతాలలో పాఠశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, రోడ్డు వసతులను యుద్ధప్రాతిపదికన మెరుగుపరచాలి. అలాగే, గిరిజన యువతకు వారి స్థానిక వనరులకు అనుగుణమైన ఉపాధి అవకాశాలు, నైపుణ్య శిక్షణ అందించాలి. ప్రకృతికి, మానవాళికి నడుమ ఉండే సమతుల్యతను కాపాడుతున్న ఆదివాసీ సోదరులను గౌరవించడం, వారి హక్కులకు రక్షణగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత. ఈ ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా ఆదివాసీల త్యాగాలను స్మరిస్తూ, వారి సంస్కృతిని పరిరక్షించి, వారికి సముచిత ప్రాధాన్యత లభించేలా ప్రతి ఒక్కరూ పునరంకితం కావాల్సిన అవసరం ఉంది.

ఎండి అబ్దుల్ రహమాన్
ఎడిటర్, ఉద్యమ కెరటం దినపత్రిక



# పేపర్ లీక్‌పై విద్యార్థుల పట్టు

- జార్ఖండ్‌లో 15 రోజులుగా కొనసాగుతున్న నిరాహార దీక్ష
- ప్రభుత్వంతో రెండో దఫా చర్చలు.. సానుకూల స్పందన
- 14వ జేపీఎస్సీ ప్రిలిమినరీ పరీక్ష రద్దుకు డిమాండ్
- ఏడేళ్ల నియామక పరీక్షలపై స్వతంత్ర దర్యాప్తు కోరుతున్న విద్యార్థులు



**రాంచీ, ఆగస్టు 8:** ప్రభుత్వ ఉద్యోగ నియామక పరీక్షల్లో అక్రమాలు, ప్రశ్నపత్రాల లీకేజీలపై జార్ఖండ్‌లో విద్యార్థుల ఆందోళన కొనసాగుతోంది. గత 15 రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్న విద్యార్థులతో రాష్ట్ర ప్రభుత్వం శనివారం రెండో దఫా చర్చలు జరిపింది. పరీక్షల నిర్వహణలో అవకతవకలు, ప్రశ్నపత్రాల లీకేజీలపై తమ డిమాండ్లను విద్యార్థి ప్రతినిధులు ప్రభుత్వం ముందు ఉంచారు. చర్చల సందర్భంగా ప్రభుత్వం సానుకూలంగా స్పందించినట్లు విద్యార్థులు వెల్లడించారు. అయితే తమ ప్రధాన డిమాండ్లపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచి చూస్తున్నట్లు స్పష్టం చేశారు. జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్, జార్ఖండ్ స్టాఫ్ సెలక్షన్ కమిషన్ నిర్వహించిన పలు ఉద్యోగ నియామక పరీక్షల్లో భారీగా అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ విద్యార్థులు రాంచీలోని జైపాల్ సింగ్ ముండా స్టేడియంలో నిరసనలు కొనసాగిస్తున్నారు. 14వ జేపీఎస్సీ కంబైన్డ్ ప్రిలిమినరీ పరీక్ష ప్రశ్నపత్రాలతో పాటు అభ్యర్థుల ఓఎంఆర్ షీట్లు లీకయ్యాయని ఆరోపిస్తూ ఆ పరీక్షను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. గతంలో వెలుగుచూసిన ప్రశ్నపత్రాల లీకేజీ కేసులపై జరుగుతున్న దర్యాప్తుపైనా విద్యార్థులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సీఐడీ విచారణ నామమాత్రంగా సాగుతోందని ఆరోపిస్తూ, గత ఏడేళ్లుగా జేపీఎస్సీ, జేఎస్ఎస్సీ నిర్వహించిన అన్ని ఉద్యోగ నియామక పరీక్షలపై సీబీఐ లేదా ఇతర స్వతంత్ర దర్యాప్తు సంస్థతో సమగ్ర విచారణ జరిపించాలని కోరుతున్నారు. పోటీ పరీక్షల నిర్వహణలో పారదర్శకత పెంచేందుకు సంస్కరణలు చేపట్టాలని విద్యార్థులు ప్రభుత్వాన్ని కోరారు. ఓఎంఆర్ షీట్లలో ఐదో ఎంపికగా 'సమాధానం ఇవ్వలేదు' అనే అవకాశాన్ని చేర్చాలని డిమాండ్ చేశారు. పరీక్షల నిర్వహణ నుంచి ఫలితాల ప్రకటన వరకు ప్రతి దశలో పారదర్శకత ఉండేలా పటిష్టమైన వ్యవస్థను తీసుకురావాలని కోరుతున్నారు. ప్రభుత్వంతో రెండో దఫా చర్చలు సానుకూలంగా జరిగినప్పటికీ స్పష్టమైన నిర్ణయం వెలువడే వరకు తమ పోరాటంపై వెనక్కి తగ్గేది లేదని ఆందోళనకారులు చెబుతున్నారు. దీంతో ప్రభుత్వం తీసుకునే తదుపరి నిర్ణయంపై విద్యార్థులు, ఉద్యోగార్థుల్లో ఉత్కంఠ నెలకొంది.




# ఎంతోకాలం యుద్ధంతో తీవ్ర నష్టం

### ఇరాన్ యుద్ధం నుంచి బయటపడడమే మేలు

### ట్రంప్‌నకు జనరల్ డాన్ కేన్ సహా ఇచ్చినట్లు ప్రచారం

**వాషింగ్టన్, ఆగస్టు 8:** ఐదు నెలలుగా ఇరాన్‌తో సాగిస్తోన్న యుద్ధం కారణంగా అమెరికా ఆయుధ నిల్వలు తరిగిపోతున్నాయని పెద్ద ఎత్తున ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘర్షణలకు త్వరగా ముగింపు పలకాలని స్వదేశంలో డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే అగ్రరాజ్య జాయింట్ చీఫ్స్ ఛైర్మన్ జనరల్ డాన్ కేన్ ట్రంప్కార్యవర్గానికి కీలక సూచనలు చేసినట్లు తెలుస్తోంది. ఇరాన్‌తో యుద్ధం నుంచి ఇకనైనా బయటపడాలని.. లేదంటే ప్రతికూల ఫలితాలను ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించినట్లు సమాచారం. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ అంతర్జాతీయ మీడియా కథనం వెల్లడించింది. ఇరాన్‌తో యుద్ధం స్వల్పకాలికంగా ఉండాల్సింది. ఇప్పటికే అది ఆ దశను దాటేసింది. పశ్చిమాసియలో ఘర్షణలు తీవ్రతరం చేయడానికి మనకు అందుబాటులో ఉన్న సైనిక చర్యలు ప్రతికూల ఫలితాలు ఇచ్చే ప్రమాదం ఉంది. కేవలం వైమానిక శక్తితోనే నిర్దేశిత లక్ష్యాలను మనం సాధించలేం. అందుకే ఇకనైనా, ఈ యుద్ధం నుంచి బయటకు వచ్చే మార్గాలను అన్వేషించాలని ట్రంప్ సలహాదారులకు డాన్ కేన్ ప్రైవేటుగా చెప్పినట్లు తెలుస్తోంది. ఇదే విషయం గురించి ఆయన పలువురు క్యాబినెట్ అధికారులు, సీఐఏ డైరెక్టర్ జాన్ రాట్‌క్లిఫ్, విదేశాంగ మంత్రి మార్కో రూబియో, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ తోనూ చర్చలు జరిపారట. ఇరాన్‌లో భూతల దాడులకు విముఖత చూపుతోన్న అధ్యక్షుడు ట్రంప్.. దానికి బదులుగా వైమానిక దాడులను మరింతగా పెంచుతామని ఇటీవల కాలంలో పదేపదే ప్రకటనలు చేస్తున్నారు. ఈ హెచ్చరికలతో ఇరాన్‌ను ఒప్పందానికి తీసుకురావొచ్చని ఆయన విశ్వసిస్తున్నారు. అయితే, సుదీర్ఘకాలంగా వైమానిక దాడులు చేపడుతుండటంతో అగ్రరాజ్య ఆయుధ నిల్వలు భారీగా తగ్గిపోతున్నాయి. ఇప్పటికే 80 శాతం మిసైల్ డిఫెన్స్ సిస్టమ్ ఇంటర్‌సెప్టర్లు, దాదాపు సగం పేట్రియాట్ క్షిపణులు కరిగిపోయినట్లు ఇటీవల కథనాలు వచ్చాయి. అయితే, వీటిని ట్రంప్ కొట్టిపారేశారు. తమ వద్ద పెద్ద ఎత్తున ఆయుధ నిల్వలు ఉన్నట్లు పేర్కొన్నారు. అంతేగాక, చరిత్రలో ఎన్నడూ లేని విధంగా.. భారీ సంఖ్యలో ఎ÷–లాంట్లు, ఫ్యాక్టరీలను రక్షణ రంగ కంపెనీలు నిర్మిస్తున్నాయని తన ట్రూత్ ఖాతాలో పోస్ట్ చేశారు. అయితే, క్షిపణుల సంఖ్య గురించి మాత్రం ఆయన కచ్చితమైన లెక్క చెప్పకపోవడం గమనార్హం.


# హనీట్రాప్‌లో వింగ్ కమాండర్!

### పాక్ మహిళ వలలో చిక్కి కీలక సమాచారం చేరవేసినట్లు ఆరోపణ

### సైనిక కదలికల వివరాలు, ఫొటోలు డిజిటల్‌గా పంపినట్లు అనుమానం

### సహోద్యోగి ఫోన్‌లో స్పైవేర్ అమర్చినట్లు దర్యాప్తులో వెల్లడి

### మేలోనే అదుపులోకి తీసుకున్న ఢిల్లీ పోలీసులు.. ఆలస్యంగా వెలుగులోకి ఘటన



**న్యూఢిల్లీ, ఆగస్టు 8:** పాకిస్థాన్ కోసం గూఢచర్యానికి పాల్పడ్డారన్న ఆరోపణలపై భారత వైమానిక దళానికి చెందిన ఓ వింగ్ కమాండర్‌ను ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్న విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జాతీయ మీడియా కథనాల ప్రకారం మే నెలలోనే అతడిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. ఈ వ్యవహారం వెనుక భారీ గూఢచర్య నెట్‌వర్క్ ఉండొచ్చని దర్యాప్తు సంస్థలు అనుమానిస్తున్నాయి. పాకిస్థాన్ నిఘా వ్యవస్థతో సంబంధాలున్నట్లు అనుమానిస్తున్న ఓ మహిళ పన్నిన హనీట్రాప్‌లో వింగ్ కమాండర్ చిక్కుకున్నట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైనట్లు సమాచారం. అతడి కార్యకలాపాలపై కొంతకాలంగా నిఘా ఉంచిన అనంతరం సంబంధిత సమాచారాన్ని పోలీసులకు అందించినట్లు వైమానిక దళ వర్గాలు తెలిపాయి. వ్యక్తిగత జీవితంలో సమస్యలు ఎదుర్కొంటున్న సమయంలో సామాజిక మాధ్యమాల ద్వారా ఓ మహిళ వింగ్ కమాండర్‌కు పరిచయమైనట్లు దర్యాప్తు వర్గాలు గుర్తించాయి. తొలుత సందేశాలతో మొదలైన పరిచయం ఆ తర్వాత వీడియో కాల్స్ వరకు వెళ్లినట్లు సమాచారం. క్రమంగా అతడి నమ్మకాన్ని సంపాదించిన తర్వాత సైనిక కదలికలకు సంబంధించిన వివరాలు, ఫొటోలు, ఇతర సమాచారాన్ని ఆమె కోరినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ఆమె కోరిన మేరకు కొన్ని కీలక వివరాలు, పత్రాలను వింగ్ కమాండర్ డిజిటల్ మాధ్యమాల ద్వారా పంపినట్లు దర్యాప్తు వర్గాలు చెబుతున్నాయి. అంతేకాకుండా ఆమె సూచనలతో తన సహోద్యోగి మొబైల్ ఫోన్‌లో నిఘా సాఫ్ట్‌వేర్‌ను అమర్చినట్లు కూడా ఆరోపణలు ఉన్నాయి. ఫోన్‌లోని సమాచారాన్ని దూరం నుంచే సేకరించడం, స్థాన వివరాలను తెలుసుకోవడం, సమాచార మార్పిడిపై నిఘా పెట్టడం లక్ష్యంగా ఆ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించినట్లు అనుమానిస్తున్నారు. వింగ్ కమాండర్‌ను సంప్రదించిన మహిళ వెనుక పాకిస్థాన్‌లోని విదేశీ హ్యాండ్లర్లు ఉన్నట్లు దర్యాప్తు సంస్థలు అనుమానిస్తున్నాయి. రక్షణ రంగానికి సంబంధించిన రహస్య సమాచారాన్ని సేకరించేందుకు పనిచేస్తున్న గూఢచర్య నెట్‌వర్క్‌లో ఆమె భాగమై ఉండవచ్చన్న కోణంలో విచారణ కొనసాగుతోంది. ఇప్పటివరకు ఎంత సమాచారం బయటకు వెళ్లింది? అందులో అత్యంత సున్నితమైన రక్షణ సమాచారం ఏమైనా ఉందా? దాని వల్ల దేశ భద్రతకు ఎంతమేర ముప్పు ఏర్పడింది? అనే అంశాలను సంబంధిత సంస్థలు విశ్లేషిస్తున్నట్లు సమాచారం. మహిళను నడిపించిన విదేశీ హ్యాండ్లర్లను గుర్తించడంతో పాటు ఈ నెట్‌వర్క్‌లో మరెవరైనా ఉన్నారా అనే కోణంలోనూ దర్యాప్తు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది.

# మహిళా బిల్లుపై మాటల మంటలు

### కేంద్రమంత్రి కిరణ్ రిజిజుకు రాహుల్ గాంధీ కౌంటర్

### మూడేళ్లుగా అమలెందుకు లేదన్న రాహుల్

### పునర్విభజనతో ముడిపెట్టడంపై కాంగ్రెస్ నేత ప్రశ్న

### మహిళలకు గొంతెత్తే అవకాశం కల్పించాలని పిలుపు

**న్యూఢిల్లీ, ఆగస్టు 8:** మహిళా రిజర్వేషన్ అంశం మరోసారి అధికార, ప్రతిపక్షాల మధ్య రాజకీయ మాటల యుద్ధానికి దారితీసింది. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు సామాజిక మాధ్యమ వేదికగా పరస్పరం విమర్శలు, ప్రతివిమర్శలు చేసుకున్నారు. మహిళా రిజర్వేషన్ చట్టానికి కాంగ్రెస్ బేషరతుగా మద్దతివ్వాలని రిజిజు కోరగా.. ఇప్పటికే కాంగ్రెస్ మద్దతుతోనే చట్టం ఏకగ్రీవంగా ఆమోదం పొందిందని రాహుల్ గుర్తుచేశారు. మూడేళ్లుగా దానిని ఎందుకు అమలు చేయలేదని కేంద్రాన్ని ప్రశ్నించారు. మహిళా శక్తిపై రాహుల్ గాంధీ విడుదల చేసిన వీడియోపై కిరణ్ రిజిజు స్పందించారు. కాంగ్రెస్‌లో ఇది సానుకూల పరిణామంగా కనిపిస్తోందని, మహిళల విషయంలో రాహుల్ వైఖరిలో మార్పు స్పష్టంగా కనిపిస్తోందని వ్యాఖ్యానించారు. ఇదే సమయంలో మహిళా రిజర్వేషన్ చట్టానికి కాంగ్రెస్ ఎలాంటి షరతులు లేకుండా మద్దతివ్వాలని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. రిజిజు వ్యాఖ్యలకు రాహుల్ గాంధీ వెంటనే కౌంటర్ ఇచ్చారు. మహిళా రిజర్వేషన్ చట్టం 2023లోనే కాంగ్రెస్ పూర్తి మద్దతుతో పార్లమెంటులో ఆమోదం పొందిందని గుర్తుచేశారు. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిగా ఈ విషయం రిజిజుకు తెలియకుండా ఎలా ఉంటుందని ప్రశ్నించారు. మహిళా రిజర్వేషన్ చట్టం ఆమోదం పొంది మూడేళ్లు గడుస్తున్నా ఇప్పటికీ ఎందుకు అమలు చేయలేదని రాహుల్ నిలదీశారు. మహిళలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించే అంశాన్ని నియోజకవర్గాల పునర్విభజనతో ఎందుకు ముడిపెడుతున్నారని ప్రశ్నించారు. ఎలాంటి షరతులు విధించకుండా మహిళా రిజర్వేషన్‌ను తక్షణమే అమల్లోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. మహిళల సామర్థ్యం దేశంలో ఇంకా పూర్తిస్థాయిలో వెలుగులోకి రాలేదని రాహుల్ తన వీడియోలో పేర్కొన్నారు. దేశం మరింత వేగంగా అభివృద్ధి చెందాలంటే మహిళలు తమ ఆలోచనలను స్వేచ్ఛగా వ్యక్తం చేసే వాతావరణం ఉండాలన్నారు. తమకు నచ్చిన రంగాల్లో ముందుకు వెళ్లేందుకు వారికి సమాన అవకాశాలు కల్పించాలని చెప్పారు. వ్యాపారం, రాజకీయాలు సహా అన్ని రంగాల్లో మహిళలు స్వేచ్ఛగా ఎదగాలని, కుటుంబాల్లోనూ తమ అభిప్రాయాలను నిర్భయంగా వెల్లడించగలగాలని రాహుల్ పేర్కొన్నారు. సమాజంలో భయం లేకుండా జీవించే పరిస్థితులు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. పితృస్వామ్య భావజాలం, మహిళలపై విధించే కఠిన నియంత్రణల నుంచి విముక్తి అవసరమని అభిప్రాయపడ్డారు. మహిళా శక్తి, మహిళా రిజర్వేషన్ అమలుపై రాహుల్ చేసిన వ్యాఖ్యలు, వాటికి రిజిజు స్పందనతో ఈ అంశం మరోసారి రాజకీయంగా వేడెక్కింది.



# రాజంపేట గ్రామ అభివృద్ధి లక్ష్యం

**ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవా లక్ష్మి**

**డివైడర్ ఎల్ ఈ డీ లైట్ల ప్రారంభోత్సవం**



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ రూరల్:** రాజంపేట గ్రామ అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నామని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు.రాజంపేట గ్రామ పంచాయతీ పరిధిలో అభివృద్ధి పనుల్లో భాగంగా నూతనంగా ఏర్పాటు చేసిన ఎల్ ఈ డీ డివైడర్ లైట్ల శనివారం ఆమె సర్పంచ్ బూర్స పోచయ్య, ఉప సర్పంచ్ మామిడి లక్ష్మి , వార్డు సభ్యులతో కలిసి ఆమె ప్రారంభించారు. గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు చేపడుతున్న ఈ విధమైన ముందడుగుపై స్థానిక ప్రజలు తీవ్ర హర్షం వ్యక్తం చేశారు. ఈ సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు సహకరించిన ఎమ్మెల్యేకి సర్పంచ్, ఉప సర్పంచ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యురాలు బొట్టుపల్లి లావణ్య , పంచాయతీ కార్యదర్శి జె. సాయికృష్ణ , జూనియర్ అసిస్టెంట్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# కుందేలును హతమార్చిన నలుగురిపై కేసు



**ఉద్యమ కెరటం, తాండూర్:** కుందేలును హతమార్చిన నలుగురుపై కేసు నమోదైనట్లు తాండూర్ అటవీ శాఖ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ కె.గౌరీశంకర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. వచ్చిన సమాచారం మేరకు తాండూర్ మండలంలోని తంగళ్లపల్లి గ్రామంలోని మండిగ శ్రీకాంత్ ఇంట్లో సోదా చేయగా చనిపోయిన కుందేలు లభ్యమైంది. సదరు వ్యక్తిని విచారించగా ఇదే గ్రామానికి చెందిన టెకం రమేష్, బండి కార్తీక్, దూల రాకేష్ నలుగురు కలిసి అడవి కుందేలును కొత్తపల్లి గ్రామంలో హతమార్చి తంగళ్లపల్లి గ్రామానికి తీసుకెళ్లారు. నలుగురు నేరస్థులను అదుపులోనికి తీసుకొని కేసును నమోదు చేసి తదుపరి విచారణ నిమిత్తం బెల్లంపల్లి రేంజ్ కార్యాలయానికి తరలించారు. ఈ దాడుల్లో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు ఎం.రాజమణి టి.గోపికృష్ణలు పాల్గొన్నారు.

# తుడుందెబ్బ నూతన మండల అధ్యక్షుడికి సన్మానం



**ఉద్యమ కెరటం, తాండూర్:** తాండూర్ మండల తుడుందెబ్బ నూతన మండల అధ్యక్షుడిగా ఎన్నికైన యాపల సమ్మయ్యను పలువురు నాయకులు శనివారం తాండూర్ మండల కేంద్రంలో ఘనంగా సన్మానించారు. శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ యాపల సమ్మయ్య నాయకత్వంలో తుడుందెబ్బ మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. ఆదివాసీల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సిరంగి శంకర్, తాండూర్ మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ ముడిమడుగుల సురేష్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మాజీ డైరెక్టర్ మాసాడి తిరుపతి, మాజీ సర్పంచ్ మణికుమార్, వార్డు సభ్యుడు పుల్గం శ్రీకాంత్, తుడుందెబ్బ నాయకులు మండిగా రవి, అరికెళ్ల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# డెక్కన్ స్ప్రింగ్స్ గ్లోబల్ స్కూల్‌లో ఘనంగా బోనాలు..






**ఉద్యమ కెరటం, నాచారం :** నాచారం డివిజన్ లోని డెక్కన్ స్ప్రింగ్స్ గ్లోబల్ స్కూల్‌లో తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకైన బోనాల వేడుకలు భక్తిశ్రద్ధలతో, ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలతో పాఠశాల ప్రాంగణమంతా వర్ణరంజితమైన రంగోలీలు, పూల అలంకరణలతో పండుగ శోభను సంతరించుకుంది. సాంప్రదాయ దుస్తులు ధరించిన బాలికలు ఎంతో అందంగా అలంకరించిన బోనం కుండలను నెత్తిన మోస్తూ రాగా, పోతరాజుల ఉత్సాహ భరిత ప్రదర్శన, సాంప్రదాయ జానపద నృత్యాలు, భక్తి గీతాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ నవనీతరావు మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో సాంస్కృతిక పరిరక్షణ భాగమని, ప్రతి ఒక్కరూ తెలంగాణ సంప్రదాయాలను గౌరవిస్తూ వాటిని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల చురుకైన భాగస్వామ్యాన్ని ఉపాధ్యాయులు ప్రశంసిస్తూ, సాంస్కృతిక వైవిధ్యాన్ని వేడుక చేసుకోవడం ప్రాముఖ్యమని పేర్కొన్నారు. వేడుకల్లో మేనేజింగ్ డైరెక్టర్ నవీన్ కుమార్, డైరెక్టర్ డాక్టర్ కమల మనోహర్ రావు, కోర్ హెడ్ ఆపరేషన్స్ కిషోర్ కుమార్ రెడ్డి, ప్రిన్సిపాల్ స్వర్ణ అక్కినేనిలతో పాటు కోర్ టీమ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నేత మల్లేష్‌ను పార్టీ నుండి బహిష్కరించాలి

- **ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు రేగుంట కేశవ్ మాదిగ**



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** మాదిగలపై తీవ్ర వివక్ష చూపుతూ కించపరిచేలా మాట్లాడిన మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా జనరల్ సెక్రెటరీ గాదివేణి మల్లేష్‌పై తక్షణమే పార్టీ క్రమశిక్షణ చర్యలు తీసుకొని బహిష్కరించాలని ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు రేగుంట కేశవ్ డిమాండ్ చేశారు. ఓ సామాజిక మాధ్యమంలో మరో నేతతో మల్లేష్ మాట్లాడిన ఫోన్ రికార్డింగ్ వైరల్ కావడం, అందులో మాదిగ సామాజిక వర్గాన్ని ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేయడంపై ఆగ్రహించిన ఎమ్మార్పీఎస్ నేతలు శనివారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌక్ నుండి గాంధీ చౌక్, వివేకానంద చౌక్ మీదుగా మల్లేష్ దిష్టిబొమ్మతో శవయాత్ర నిర్వహించి దహనం చేశారు. అనంతరం స్థానిక సీఐ నీలం రవికి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలంటూ ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రేగుంట కేశవ్ మాట్లాడుతూ మొదటి నుండి మాదిగలపై మల్లేష్ వివక్ష చూపుతున్నారని ఆరోపిస్తూ, మాదిగలు ఓటు వేయకుండానే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందా అని ప్రశ్నించారు. పార్టీలో మాదిగలకు ఇప్పటివరకు ఎటువంటి పదవులనూ ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేస్తూ, తమపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఆయనపై పోలీసులు కేసు నమోదు చేసి, కాంగ్రెస్ పార్టీ నుంచి బహిష్కరించాలని, లేకుంటే ఆందోళనలను ఉధృతం చేసి రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు దూడల అశోక్, రామచందర్, జయరాజ్, రాజలింగు, ఇప్ప నాగరాజు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల కంటి చూపు కాపాడటమే లక్ష్యం

**సర్పంచ్ బుర్స పోచయ్య**



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ రూరల్:** గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా, వారి కంటి చూపు సమస్యలను నివారించడమే లక్ష్యంగా రాజంపేట గ్రామ పంచాయతీలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు గ్రామ సర్పంచ్ బుర్స పోచయ్య తెలిపారు. రాజంపేట గ్రామపంచాయతీలో సర్పంచ్ ఆధ్వర్యంలో, ప్రముఖ 'మ్యాక్సివిజన్ ఐ హాస్పిటల్' సహకారంతో ఈ శిబిరాన్ని శనివారం అత్యంత ఉత్సాహంగా, విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బుర్స పోచయ్య మాట్లాడుతూ నిరుపేదలు కంటి సమస్యల బారిన పడి ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతోనే ఈ వైద్య శిబిరాన్ని అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. శిబిరంలో మ్యాక్సివిజన్ వైద్య బృందం పాల్గొని గ్రామ ప్రజలకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలు (ఆపరేషన్లు) కూడా అందిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ మామిడి లక్ష్మి, వార్డు సభ్యులు బొట్టుపెల్లి లావణ్య, నాన్నయ్య, గ్రామపంచాయతీ సిబ్బంది, సంతోష్ పోషణ కేంద్రం సిబ్బంది, బీసీ యువజన సంఘం డివిజన్ అధ్యక్షులు బొట్టుపెల్లి ప్రశాంత్, మ్యాక్సివిజన్ వైద్య బృందం సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# 'జైల్ భరో'ను జయప్రదం చేయండి

- **అఖిల భారత రైతు సంఘం, సీఐటీయూ పిలుపు**



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ :** కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆగస్టు 10న నిర్వహించే 'జైల్ భరో' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని అఖిల భారత రైతు సంఘం జిల్లా ఇంచార్జ్ దుర్గం దినకర్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాజేందర్ పిలుపునిచ్చారు. శనివారం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో కార్మికులతో కలిసి వారు ప్రచార కరపత్రాలను విడుదల చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రం తీసుకొచ్చిన 4 లేబర్ కోడ్స్‌ను తక్షణమే రద్దు చేసి పాత కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. లేబర్ కోడ్స్ వల్ల 8 గంటల పనిదినం పోయి 12 గంటల పనివేళలు వచ్చే ప్రమాదం ఉందన్నారు. రైతులకు పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, ఉపాధి హామీ పథకాన్ని బలోపేతం చేయాలని, ఆశా, అంగన్‌వాడీ, మున్సిపల్, సింగరేణి, ఐకేపీ వంటి స్కీమ్ వర్కర్లకు కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.జిల్లాలోని 335 గ్రామాలు, 15 మండలాలు, 2 మున్సిపాలిటీల్లో చేపట్టే ఈ నిరసనల్లో కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్మికులు పాల్గొన్నారు.

# మాచినేని కృష్ణయ్యను పరామర్శించిన మంత్రి తుమ్మల

**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పెనుబల్లి మండలం లంకపల్లి గ్రామానికి చెందిన మాచినేని కృష్ణయ్యను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శనివారం పరామర్శించారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న కృష్ణయ్య ఆరోగ్య పరిస్థితిని మంత్రి అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యులతో మాట్లాడిన మంత్రి కృష్ణయ్యకు అందుతున్న చికిత్స, ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించడంతో పాటు అవసరమైన అన్ని వైద్య సేవలు అందేలా చూడాలని వైద్యులకు సూచించారు. మాచినేని కృష్ణయ్యకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. మంత్రి ఆసుపత్రికి వచ్చి పరామర్శించడంతో కృష్ణయ్య కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి నియోజకవర్గానికి చెందిన తుమ్మల అభిమానులు పాల్గొన్నారు.



# ఓట్లకు వచ్చారు.. గెలిచాక మరిచారు..!

- ఉస్మాన్‌పూర్‌లో సమస్యలు పట్టించుకునేది ఎవరు..?







**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** మండల కేంద్రంలోని ఉస్మాన్‌పూర్‌లో 14, 15వ వార్డుల మధ్య నెలకొన్న పారిశుధ్యం, విద్యుత్ తీగలు, సీసీ రోడ్డు సమస్యలతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భారీగా చెత్తాచెదారం పేరుకుపోవడంతో పాటు పిచ్చిమొక్కలు, చెట్ల పొదలు పెరిగిపోయి పరిసరాలు అధ్వానంగా మారాయి. దుర్వాసన వెదజల్లడంతో పాటు దోమలు, ఈగలు పెరిగి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**నెల రోజుల్లో సీసీ రోడ్డు అన్నారు.. మరిచారు..!**

ఉస్మాన్‌పూర్‌లో సీసీ రోడ్డు లేకపోవడంతో వృద్ధులు, చిన్నారులు, పాదచారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఎన్నికల సమయంలో నెల రోజుల్లో సీసీ రోడ్డు నిర్మిస్తామని హామీ ఇచ్చిన నాయకులు, గెలిచిన తర్వాత ఆ హామీని మరిచారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా రోడ్డు నిర్మాణంపై అధికారులు, గ్రామపంచాయతీ పాలకవర్గం దృష్టి సారించాలని కోరుతున్నారు.

**ప్రమాదకరంగా విద్యుత్‌తీగలు..**

చెట్ల కొమ్మల మధ్యలో విద్యుత్ తీగలు వేలాడుతూ ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ తీగలను వెంటనే సరిచేసి ప్రమాదాలను నివారించాలని కోరుతున్నారు. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం ఇంటింటికీ తిరిగి హామీలు ఇచ్చిన నాయకులు, గెలిచిన తర్వాత ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు. వార్డుల మధ్యలో చెత్త పేరుకుపోవడం, పిచ్చిమొక్కలు పెరగడం, ప్రమాదకరంగా విద్యుత్ తీగలు వేలాడుతుండడం వంటి సమస్యలు కళ్లకు కనిపిస్తున్నా సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఓట్లు అడిగేందుకు ఇంటింటికీ వచ్చారు.. గెలిచాక మా వార్డుల వైపు కన్నెత్తి చూడటం లేదంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు, గ్రామపంచాయతీ పాలకవర్గం వెంటనే స్పందించి చెత్తను తొలగించి, పిచ్చిమొక్కలు, చెట్ల పొదలను శుభ్రం చేయడంతో పాటు విద్యుత్ తీగలను సరిచేసి సీసీ రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# గంభీరావుపేట–లింగన్నపేట హైలెవెల్ బ్రిడ్జి పనులు వేగవంతం చేయాలి

**బీజేపీ మండల అధ్యక్షుడు కోడె రమేష్**



**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** గంభీరావుపేట–లింగన్నపేట హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణ పనులను తక్షణమే వేగవంతం చేసి పూర్తి చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు కోడె రమేష్ డిమాండ్ చేశారు. శనివారం వర్షం నీటిలో నిలబడి నిరసన వ్యక్తం చేశారు. బ్రిడ్జి నిర్మాణంలో జాప్యం కారణంగా ప్రజలు, రైతులు, విద్యార్థులు, వ్యాపారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణం పేరుతో స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్ ర్యాలీలు, పాలాభిషేకాలు నిర్వహించి పాత వంతెనను తొలగించారని, అయితే కొత్త వంతెన నిర్మాణం పూర్తికాకపోవడంతో ప్రతి వర్షాకాలంలో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లు గడిచినా బ్రిడ్జి నిర్మాణ పనుల్లో ఆశించిన స్థాయిలో పురోగతి కనిపించడం లేదని ఆరోపించారు. ఎగువ మానేరు ప్రాజెక్టుకు వరద నీరు రావడంతో అధికారులు, కాంగ్రెస్ నాయకులు ప్రాజెక్టును సందర్శిస్తున్నప్పటికీ, ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నా హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలించకపోవడం బాధాకరమన్నారు. ప్రజా సమస్యలను పట్టించుకోకుండా రాజకీయ ప్రచారాలకే పరిమితమవుతున్నారని విమర్శించారు.ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పందించి బ్రిడ్జి నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని, వర్షాకాలంలో ప్రజలకు రాకపోకల ఇబ్బందులు లేకుండా తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

# సత్తుపల్లి లో మిస్సింగ్ కేసు

- అత్తను హత్య చేసి శవాన్ని కాల్చిన అల్లుడు..!
- వివాహేతర సంబంధమే హత్యకు కారణమా..? పోలీసుల అనుమానం



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** సత్తుపల్లి మండలం తుంబూరు గ్రామంలో వృద్ధురాలి మిస్సింగ్ కేసు విషాదాంతంగా మారింది. మూడు రోజులుగా కనిపించకుండా పోయిన వెంకట నరసమ్మ (60)ను ఆమె అల్లుడే హత్య చేసి, మృతదేహాన్ని కాల్చి బూడిద చేసినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైనట్లు సమాచారం. ఈనెల 3న వెంకట నరసమ్మ కనిపించడం లేదంటూ ఆమె కుమార్తెలు సత్తుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో అనుమానితులను విచారించగా, అల్లుడే అత్తను హత్య చేసినట్లు పోలీసుల విచారణలో సమాచారం వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది. హత్య అనంతరం మృతదేహాన్ని కాల్చివేయడంతో మృతురాలి ఆనవాళ్లు గుర్తించడం పోలీసులకు సవాల్‌గా మారింది. అయితే ఫోరెన్సిక్ నిపుణులు కాలిపోయిన ప్రాంతంలో మృతురాలు వెంకట నరసమ్మకు సంబంధించిన అస్థికలను గుర్తించినట్లు తెలుస్తోంది. అస్థికలను డీఎన్ఏ పరీక్షల నిమిత్తం అధికారులు తరలించారు. డీఎన్ఏ పరీక్షల అనంతరం మృతురాలి గుర్తింపుపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఈ ఘటనకు అల్లుడి వివాహేతర సంబంధమే కారణమై ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నట్లు సమాచారం. ఈ కోణంలోనూ పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి నిందితుల కోసం ప్రత్యేక పోలీసు బృందాలు గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తు పూర్తయిన తర్వాత వెల్లడిస్తామని వివరించారు.

# రెండవ శనివారం బడులు తెరిస్తే చర్యలు

- ప్రభుత్వ సెలవు రోజున తరగతులా..?
- ప్రైవేట్ పాఠశాలలకు హెచ్చరిక
- నిబంధనలు అతిక్రమిస్తే షోకాజ్ నుంచి గుర్తింపు రద్దు వరకు చర్యలు
- విద్యా క్యాలెండర్ తప్పనిసరిగా పాటించాల్సిందే




**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** ప్రభుత్వం నిర్దేశించిన విద్యా క్యాలెండర్, సెలవుల పట్టికను అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ గుర్తింపు పొందిన పాఠశాలలు తప్పనిసరిగా అమలు చేయాల్సి ఉంటుందని విద్యా శాఖ స్పష్టం చేస్తోంది. ప్రభుత్వం సెలవుగా ప్రకటించిన రెండవ శనివారం రోజున విద్యార్థులకు తరగతులు నిర్వహించడం, హాజరు కావాలని బలవంతం చేయడం విద్యా శాఖ నిబంధనలకు విరుద్ధమని అధికారులు పేర్కొంటున్నారు. ఇలాంటి ఘటనలపై తల్లిదండ్రులు, ప్రజల నుంచి ఫిర్యాదులు అందిన వెంటనే సంబంధిత పాఠశాలపై జిల్లా విద్యా శాఖ అధికారులు విచారణ చేపడతారు. నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు తేలితే ముందుగా షోకాజ్ నోటీసు జారీ చేసి యాజమాన్యం వివరణ కోరుతారు. అనంతరం వివరణ సంతృప్తికరంగా లేకపోతే హెచ్చరికలు, జరిమానాలు, గుర్తింపు నిబంధనల మేరకు క్రమశిక్షణ చర్యలు, అవసరమైతే పాఠశాల గుర్తింపుపై కూడా చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. పదేపదే ఉల్లంఘనలు జరిగితే మరింత కఠిన చర్యలు తీసుకునే అధికారం విద్యా శాఖకు ఉందని స్పష్టం చేస్తున్నారు. ప్రభుత్వ సెలవు రోజుల్లో విద్యార్థులను బలవంతంగా పాఠశాలకు రప్పించడం, ప్రత్యేక తరగతులు, ఇతర కార్యక్రమాల పేరుతో ఒత్తిడి చేయడం, అదనపు ఫీజులు వసూలు చేయడం వంటి అంశాలపై తల్లిదండ్రులు మండల విద్యా శాఖ అధికారి, జిల్లా విద్యా శాఖ అధికారి, ఉన్నతాధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చని అధికారులు సూచిస్తున్నారు. అయితే విద్యా శాఖ నుంచి ముందస్తు అనుమతి, ప్రభుత్వం ప్రత్యేక ఆదేశాలు జారీ చేసిన సందర్భాల్లో మాత్రమే సెలవు రోజున విద్యా కార్యక్రమాలు నిర్వహించే అవకాశం ఉంటుందని స్పష్టం చేస్తున్నారు. విద్యార్థుల శారీరిక, మానసిక విశ్రాంతిని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం సెలవులను నిర్దేశిస్తుందని, అన్ని విద్యా సంస్థలు ప్రభుత్వ నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తూ విద్యార్థులు, తల్లిదండ్రుల హక్కులను పరిరక్షించాలని విద్యా నిపుణులు సూచిస్తున్నారు. ప్రైవేట్ పాఠశాలలు రెండవ శనివారం ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలు నిర్వహించినట్లు ఎవరైనా తల్లిదండ్రులు ఫిర్యాదు చేస్తే, ఆ ఫిర్యాదును జిల్లా విద్యా శాఖ అధికారికి పంపిస్తాం. జిల్లా విద్యా శాఖ అధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని మండల విద్యా శాఖ అధికారి పద్మ వివరించారు.

## విద్యార్థు ల హాజరు శాతం పెంచాలి



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** విద్యార్థుల హాజరు శాతం పెంచేలా చర్యలు చేపట్టాలని డీఐఈఓ గణేష్ జాదవ్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన తరగతి గదులకు పరిశీలించి అధ్యాపకుల బోధన తీరు గురించి విద్యార్థు ల ద్వారా అడిగి తెలుసుకున్నారు. కళాశాలకు సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం కళాశాల అధ్యాపకులు, నాన్-టీచింగ్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. విద్యార్థుల హాజరు శాతాన్ని గణనీయంగా పెంచేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేలా అధ్యాపకులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శబాన తరన్నుం, సూపరింటెండెంట్ షేక్ మోసిన్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ సెక్యూరిటీ గార్డ్ మృతి





**ఉద్యమ కెరటం, తాండూర్:** తాండూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రేచిని గ్రామానికి చెందిన గోగర్ల ప్రవీణ్(26) అనే యువకుడు మృతి చెందినట్లు తాండూర్ ఎస్సై కె.ప్రసాద్ రావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. తాండూర్ ఐబి నుంచి ద్విచక్ర వాహనంపై రేచిని గ్రామానికి వెళ్తుండగా ఎన్టీఆర్ కాలనీ దాటిన తర్వాత గేదె అడ్డు రావడంతో బైక్ అదుపు తప్పి కింద పడిపోయాడు. స్థానికులు 108 అంబులెన్స్ లో బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తీవ్ర గాయాల కారణంగా పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు కరీంనగర్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు మృతిచెందినట్లు నిర్ధారించడంతో శవపంచనామ కోసం బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చారు. మృతుడు ప్రవీణ్ ప్రైవేట్ సెక్యూరిటీ గార్డ్ గా విధులు నిర్వహిస్తున్నాడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి తండ్రి గోగర్ల రాజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

## కొలాం గ్రామాల సమస్యలను మంత్రుల దృష్టికి తీసుకెళ్తా





**ఉద్యమ కెరటం, కెరమెరి:** కొలాం గ్రామాల సమస్యలను మంత్రుల దృష్టికి తీసుకెళ్తానని కెరమెరి కాంగ్రెస్ మండల నూతన అధ్యక్షుడు మోహమ్మద్ సుజాయిత్ ఖాన్ అన్నారు. కొలాం సంఘం నాయకులు శనివారం ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మండలంలోని కోలాం గ్రామాల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా సుజాయిత్ ఖాన్ మాట్లాడుతూ మండలంలోని కొలాం గ్రామాలను త్వరలోనే సందర్శించి ప్రజా సమస్యలను తెలుసుకుంటానని తెలిపారు. ఆయా గ్రామాల సమస్యలను పీఓ, ఆత్రం సుగుణ ద్వారా మంత్రుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కొలాం ప్రజల సంక్షేమం, అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కొలాం నాయకులు మడవి రాజు, ఆత్రం రాజు, కుమ్రం మారుతి, ఆత్రం దేవరావు, సిడాం మారుతి, సీనియర్ నాయకులు సిడాం జగన్నాథ్ రావు తదితరులు పాల్గొన్నారు.

# ఎగువ మానేరు మత్తడి దూకే అవకాశం

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి




**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** ఎగువ మానేరు పరీవాహక ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఎగువ మానేరు ప్రాజెక్టు మత్తడి పైనుంచి వరద నీరు వచ్చే అవకాశం ఉందని గంభీరావుపేట తహశీల్దార్ మారుతి రెడ్డి, ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఈ నేపథ్యంలో మండల ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా వాగు పరివాహక ప్రాంతాల ప్రజలు వాగుల వైపు వెళ్లవద్దని, వరద ప్రవాహం ఎప్పుడు పెరుగుతుందో తెలియని పరిస్థితుల్లో వాగులను దాటే ప్రయత్నం చేయకూడదని హెచ్చరించారు. వాగుల వద్దకు పశువులను మేత కోసం తీసుకెళ్లడం, అవతలి గట్టున కట్టివేయడం చేయవద్దని పేర్కొన్నారు. మేకలు, గొర్రెల కాపరులు సైతం పశువులను వాగుల వైపు తీసుకెళ్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. భారీ వర్షాల కారణంగా పరిస్థితులు ఎప్పటికప్పుడు మారే అవకాశం ఉన్నందున ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని, అధికారులు జారీ చేసే సూచనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. ప్రజల ప్రాణ భద్రతే ప్రధానమని, అత్యవసర పరిస్థితుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించి ప్రమాదాలకు గురికావద్దని సూచించారు.

# విద్యా భారతి పాఠశాలలో ఘనంగా బోనాలు, గోరింటాకు వేడుకలు




**ఉద్యమ కెరటం, తాండూర్:** తాండూర్ మండలం కిష్టంపేట విద్యా భారతి ఉన్నత పాఠశాలలో శనివారం బోనాల సందడి, ఆషాఢ మాస గోరింటాకు వేడుకలను విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. వేడుకలకు ముందు ఉపాధ్యాయులు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ సురభి శరత్ కుమార్ మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలను భావితరాలకు పరిచయం చేయాలనే ఉద్దేశంతో విద్యార్థినులు, మహిళా ఉపాధ్యాయులు కలిసి బోనాలు, గోరింటాకు వేడుకలను నిర్వహించడం సంతోషకరమని అన్నారు. పాడిపంటలు, పశుసంపద వృద్ధి చెందడంతో పాటు ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, విద్యార్థులు విద్యలో రాణించాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థినులు అమ్మవారి బోనాల వేడుకలను ప్రతిబింభించేలా సాంస్కృతిక నృత్యాలతో అలరించారు. మహిళా ఉపాధ్యాయులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి గోరింటాకు వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల సందడితో పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది.

# చేయూత పింఛన్ల కు దరఖాస్తుల స్వీకరణ

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** చేయూత సామాజిక భద్రత పింఛన్ల కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా కలెక్ట ర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులు సంబంధిత ఎంపీడీఓ, మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, కల్లుగీత కార్మికులు, సికిల్ సెల్, తలసేమియా, హీమోఫీలియా, బోదకాలు, డయాలసిస్ బాధితులు, చేనేత కార్మికులు పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. దరఖాస్తుతో పాటు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, బ్యాంకు ఖాతా పుస్తకం, కుల ధ్రువీకరణ పత్రం, సదరం ధ్రువీకరణ పత్రాలను తప్పనిసరిగా జత చేయాలని సూచించారు. అర్హత కలిగిన వారు ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అవసరమైన పత్రాలతో దరఖాస్తులు సమర్పించాలని దీపక్ కోరారు.

# రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి

- నీటి వినియోగంలో పొదుపు పాటించాలి
- జిల్లా కలెక్ట ర్ కుమార్ దీపక్



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా నమోదవుతున్న నేపథ్యంలో అందుబాటులో ఉన్న నీటి వనరులను పొదుపుగా వినియోగిస్తూ రైతులకు నష్టం కలగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. శనివారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవనంలో వ్యవసాయ, నీటి పారుదల శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అందుబాటులో ఉన్న నీటిలో తాగునీటికి తొలి ప్రాధాన్యత ఇవ్వాలని, నీటి వృథాను పూర్తిగా నివారించి అవసరానికి అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా వినియోగించాలని ఆదేశించారు. సాగునీటి వనరులు, కాలువల నిర్వహణపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని పేర్కొన్నారు. వర్షపాతం తగ్గే పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తక్కువ నీరు అవసరమయ్యే పంటలను ఎంపిక చేసుకునేలా రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. గ్రామస్థాయిలో రైతులను కలిసి పంటల వైవిధ్యీకరణ ప్రయోజనాలను వివరించాలని, అధిక నీటి అవసరం ఉన్న పంటలకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలు, కూరగాయల సాగును ప్రోత్సహించాలని తెలిపారు. రైతుల నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని, నీటి విడుదల, కాలువల నిర్వహణలో సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురుస్తున్నందున నీటి బొట్టును పొదుపుగా వినియోగించాలని సూచించారు. రైతు ప్రయోజనమే ప్రధాన లక్ష్యంగా అధికారులు 24 గంటలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. నారు పోసిన రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా కడెం రిజర్వాయర్ నుంచి ఆదివారం ఉదయం నీటిని విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఈనెల 15 నుంచి నూతన చేయూత పింఛన్ల జారీ ప్రక్రియ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. అదే విధంగా 15వ తేదీ నుంచి నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్లు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల చైర్మన్లు, వ్యవసాయ, నీటిపారుదల శాఖల అధికారులు, ఏఈలు, డీఈలు, మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# రూ.వెయ్యి కోట్ల సైబర్ మోసం

- కేసులో కీలక సూత్రధారి దేవరపల్లి పట్టాభికి రిమాండ్
- అంతర్జాతీయ మనీ లాండరింగ్ కోణంలో దర్యాప్తు




**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** ఖమ్మం జిల్లా సత్తుపల్లి కేంద్రంగా వెలుగులోకి వచ్చిన సుమారు రూ.వెయ్యి కోట్ల భారీ సైబర్ క్రైమ్, మనీ లాండరింగ్ కేసులో కీలక సూత్రధారి ఖమ్మం జిల్లా కల్లూరు మండలం లింగాల గ్రామానికి చెందిన దేవరపల్లి పట్టాభిని సైబరాబాద్ పోలీసులు ఈనెల 4న అరెస్టు చేశారు. కోర్టు లో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల ప్రాథమిక దర్యాప్తు ప్రకారం.. పట్టాభి గతంలో హైదరాబాద్ మాదాపూర్‌లో 'రిడ్జ్ ఐటీ సొల్యూషన్స్' పేరుతో కాల్ సెంటర్ నిర్వహించినట్లు గుర్తించారు. ఖమ్మం, కోల్‌కతా ప్రాంతాలకు చెందిన పలువురు యువకులను టెలీకాలర్లుగా నియమించుకుని, విదేశీయులను లక్ష్యంగా చేసుకుని నకిలీ ఈ-మెయిల్స్, భయపెట్టే సందేశాల ద్వారా భారీ మొత్తంలో మోసాలకు పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. రెండేళ్ల వ్యవధిలోనే రూ.100 కోట్లకు పైగా అక్రమంగా సంపాదించినట్లు అధికారులు భావిస్తున్నారు. ఈ వ్యవహారంలో అతని సోదరులు ప్రవీణ్, ప్రకాష్ పాత్ర కూడా ఉన్నట్లు విచారణలో వెల్లడైనట్లు తెలిపారు.

### మ్యూల్ ఖాతాల ద్వారా అక్రమ లావాదేవీలు..

కేసు తీవ్రత దృష్ట్యా రాష్ట్ర డీజీపీ ఆధ్వర్యంలో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను ఏర్పాటు చేశారు. దర్యాప్తులో భాగంగా నిరుద్యోగులు, అమాయకుల పేర్లతో మ్యూల్ బ్యాంకు ఖాతాలు తెరిపించి, దేశ వ్యాప్తంగా సైబర్ మోసాల ద్వారా సేకరించిన నగదును ఆయా ఖాతాల్లోకి మళ్లించినట్లు పోలీసులు గుర్తించారు. అనంతరం ఆ నగదును క్రిప్టో కరెన్సీగా మార్చి దుబాయ్ కేంద్రంగా పనిచేస్తున్న అంతర్జాతీయ సైబర్ ముఠాలకు తరలించినట్లు అనుమానిస్తున్నారు. ఇప్పటికే ఈ కేసులో 50 మందికి పైగా నిందితులను పోలీసులు అరెస్టు చేసినట్లు తెలిపారు. పోట్రు మనోజ్ కళ్యాణ్, పోట్రు ప్రదీప్, పోట్రు ప్రవీణ్, ఉడతనేని వికాస్ చౌదరి, చెన్నకేశవరావు తదితరులు ప్రధాన నిందితులుగా ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. అమాయక నిరుద్యోగులు, వ్యాపారులకు కమిషన్ల ఆశ చూపించి వారి పేర్లతో బ్యాంకు ఖాతాలు తెరిపించి, వాటి ద్వారా అక్రమ లావాదేవీలు నిర్వహించినట్లు దర్యాప్తులో తేలిందన్నారు.

### బంధువులు, స్నేహితుల ఖాతాల వినియోగం..

అంతర్జాతీయ మనీ లాండరింగ్ కోణం ఉండటంతో పోలీసులు దర్యాప్తును మరింత లోతుగా కొనసాగిస్తున్నారు. పట్టాభి బంధువులు, స్నేహితులకు చెందిన బ్యాంకు ఖాతాలు కూడా వినియోగించినట్లు విచారణలో తేలినట్లు సమాచారం. తమ ఖాతాలను అక్రమంగా వినియోగించారని పలువురు బాధితులు పోలీసులను ఆశ్రయిస్తున్నట్లు తెలుస్తోంది. 2025 డిసెంబర్ 4న మోదుగు సాయికిరణ్ అనే వ్యక్తి తన బ్యాంకు ఖాతా ద్వారా అక్రమ లావాదేవీలు జరిగినట్లు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ భారీ సైబర్ క్రైమ్ వ్యవహారం వెలుగులోకి వచ్చినట్లు అధికారులు తెలిపారు. అనంతరం దర్యాప్తు వేగవంతం చేసిన పోలీసులు 2026 జనవరిలో 18 మందిని అరెస్టు చేసి, ప్రస్తుతం కేసును మరింత విస్తృతంగా దర్యాప్తు చేస్తున్నారు.

### ప్రజలు అప్రమత్త ంగా ఉండాలి..

సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. అపరిచితులకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటీపీలు, బ్యాంకు వివరాలు, పాస్‌వర్డు లు వెల్లడించవద్దని, అనుమానాస్పద లింకులను క్లిక్ చేయకూడదని హెచ్చరించారు. కమీషన్ల ఆశతో తమ బ్యాంకు ఖాతాలను ఇతరులకు ఇవ్వవద్దని, అనుమానాస్పద లావాదేవీలు గుర్తించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

# చేయూత పింఛన్ల కోసం అర్హులు దరఖాస్తు చేసుకోవాలి

## జిల్లా కలెక్ట ర్ రాజర్షి షా



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** గత కొంత కాలంగా చేయూత పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం మరోసారి అవకాశం కల్పించిందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. అర్హులైన ప్రతిఒక్కరూ సంబంధిత కార్యాలయాల్లో దరఖాస్తులు సమర్పించి ప్రభుత్వ సంక్షేమ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల వారు గ్రామపంచాయతీ కార్యదర్శి ద్వారా సంబంధిత ఎంపీడీఓ కార్యాలయంలో, పట్టణ ప్రాంతాల వారు మున్సిపల్ వార్డు అధికారుల ద్వారా సంబంధిత మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు, గీత కార్మికులు, చేనేత కార్మికులు కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఫైలేరియా పింఛనుదారులు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో, డయాలసిస్, సికిల్ సెల్, హీమోఫిలియా బాధితులు రిమ్స్ లో దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకుని పింఛను మంజూరు పెండింగ్‌లో ఉన్న వారు కూడా తప్పనిసరిగా మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేశారు. దరఖాస్తుతో పాటు ఫొటోతో కూడిన దరఖాస్తు ఫారం, ఆధార్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్ మొదటి పేజీ, ఆదాయ ధ్రువీకరణ పత్రం, రేషన్ కార్డు, ఓటరు గుర్తింపు కార్డు జతపర్చాలని తెలిపారు. వితంతు పింఛనుకు మరణించిన వారి ఆధార్ కార్డు, మరణ ధ్రువీకరణ పత్రం, ఒంటరి మహిళ పింఛనుకు తహశీల్దార్ ధ్రువీకరణ పత్రం, లేనియెడల విడాకుల పత్రం, ఆధారితుల ఆధార్ కార్డు, దివ్యాంగుల పింఛనుకు సదరం ధ్రువీకరణ పత్రం సమర్పించాలని సూచించారు. అవసరమైన పత్రాలు లేకుండా సమర్పించే దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోబోమని అన్నారు. అర్హులైన లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# చిన్నారులకు తప్పనిసరిగా వ్యాక్సిన్లు వేయించాలి




**ఉద్యమ కెరటం, జైనూర్:** ఐదేళ్లలోపు చిన్నారులందరికీ ప్రభుత్వం సూచించిన వ్యాధి నిరోధక టీకాలను తప్పనిసరిగా వేయించాలని పవర్‌గూడ గ్రామ సర్పంచ్ తొడసం రాజేందర్ అన్నారు. శనివారం పవర్‌గూడ గ్రామంలో చిన్నారులకు వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్య పరిరక్షణలో వ్యాధి నిరోధక టీకాలు ఎంతో కీలకమని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు అన్ని వ్యాక్సిన్లను నిర్ణీత సమయంలో వేయించాలని సూచించారు. ప్రాణాంతక వ్యాధుల నుంచి చిన్నారులను రక్షించేందుకు టీకాలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. గ్రామంలోని ఐదేళ్లలోపు పిల్లలందరికీ వ్యాక్సిన్ అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. వ్యాక్సినేషన్ ద్వారా చిన్నారులకు భవిష్యత్తులో వ్యాధులు సోకకుండా ముందస్తు రక్షణ కల్పించవచ్చన్నారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆరోగ్య కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామంలో ఏ చిన్నారికి కూడా వ్యాక్సిన్ వేయడం తప్పిపోకుండా ఆరోగ్య సిబ్బందితో సమన్వయం చేసుకుని చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల హక్కుల పరిరక్షణకు ఏకమవ్వాలి

- సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్ రెడ్డి
- బెంగళూరులో ఐజేయూ జాతీయ కార్యవర్గ సమావేశాలు
- జర్నలిస్టుల భద్రతపై విస్తృత చర్చ




**ఉద్యమ కెరటం, బెంగళూరు :** ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ అనుబంధ సంఘమైన కర్ణాటక స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ ఆధ్వర్యంలో "జర్నలిజానికి, వర్కింగ్ జర్నలిస్టులకు రక్షణ అవసరమా?" అనే అంశంపై శనివారం బెంగళూరులో ప్రత్యేక సదస్సు జరిగింది. ఆగస్టు 8, 9 తేదీల్లో నిర్వహించే ఐజేయూ జాతీయ కార్యవర్గ సమావేశాల్లో భాగంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకాగా, 'ది వైర్' వ్యవస్థాపక సంపాదకులు సిద్ధార్థ వరదరాజన్ కీలక ప్రసంగం చేశారు. సదస్సులో జస్టిస్ సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ 2020లో వర్కింగ్ జర్నలిస్టుల రెండు ప్రధాన చట్టాలతో సహా మొత్తం 13 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిందని తెలిపారు. ఈ చట్టాలను రద్దు చేయడానికి పార్లమెంటులో ఎటువంటి నిర్దిష్టమైన కారణాలు వెల్లడించలేదని, ఇలాంటి చర్యలను న్యాయస్థానాల్లో సవాలు చేసేందుకు ఉన్న చట్టపరమైన అవకాశాలను పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం మీడియా ప్రేక్షక పాత్రకే పరిమితం కాకుండా నిష్పాక్షికమైన రిఫరీ పాత్రను పోషించాలని ఆయన సూచించారు. నూతన తరానికి చెందిన డిజిటల్ మీడియా జర్నలిస్టులు తాము నివేదించే అంశాలపై లోతైన అధ్యయనం చేసి, వాస్తవాలపై సమగ్ర అవగాహన పెంచుకుంటేనే మీడియా విశ్వసనీయత పెరుగుతుందని చెప్పారు. ముందస్తు సంప్రదింపులు లేకుండా అకస్మాత్తుగా జర్నలిస్టుల చట్టాలను రద్దు చేయడం సరికాదని, జర్నలిస్టులను సాధారణ ఉద్యోగులతో పోల్చలేమని స్పష్టం చేస్తూ జర్నలిస్టులకు రక్షణ అత్యంత ఆవశ్యకమని పేర్కొన్నారు. అనంతరం సిద్ధార్థ వరదరాజన్ మాట్లాడుతూ, భారతదేశంలో జర్నలిజానికి, వర్కింగ్ జర్నలిస్టులకు రక్షణ కల్పించడం అత్యంత కీలకమని వ్యాఖ్యానించారు. గతంలో క్లిష్టమైన సమస్యలను రిపోర్ట్ చేసే జర్నలిస్టులకు పరువునష్టం కేసులు ప్రధాన సమస్యగా ఉండేవి కానీ, ప్రస్తుతం దేశద్రోహం, చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (ఉపా ), పబ్లిక్ సేఫ్టీ యాక్ట్ వంటి తీవ్రమైన చట్టాల కింద కేసులు నమోదు చేస్తూ జర్నలిస్టులను అణచివేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ప్రకటనలు, ప్రజా సంబంధాల నిధులను అస్త్రాలుగా చేసుకుని మీడియా సంస్థలపై ఒత్తిడి తేవడం స్వతంత్ర జర్నలిజానికి పెద్ద సవాలుగా మారిందన్నారు. డిజిటల్ మీడియాపై నియంత్రణ సాధించేందుకు డిజిటల్ సర్వీసెస్ బ్రాడ్ కాస్టింగ్ చట్టం ముసాయిదాను ప్రభుత్వం తీసుకువచ్చే దిశగా అడుగులు వేస్తోందని ఆరోపించారు. కర్ణాటక మీడియా అకాడమీ చైర్ పర్సన్ ఆయేషా ఖానమ్ మాట్లాడుతూ జర్నలిస్టులు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని, ఐక్యత లోపించడం వల్లే సమాజంలో విశ్వసనీయత తగ్గుతోందని అన్నారు. తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్, ఐజేయూ మాజీ అధ్యక్షుడు కే. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ స్వాతంత్రోద్యమం తర్వాత వచ్చిన నాయకులు జర్నలిస్టుల హక్కుల పరిరక్షణకు కృషి చేస్తే, నేటి పాలకులు హక్కుల హరణకు ప్రాధాన్యత ఇస్తున్నారని విమర్శించారు. రద్దు చేసిన వర్కింగ్ జర్నలిస్ట్ యాక్ట్, వేజ్ బోర్డు పునరుద్ధరణ కోసం జర్నలిస్టులంతా విస్తృత పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. 4 కార్మిక స్మృతులకు (లేబర్ కోడ్స్) వ్యతిరేకంగా జరిగిన జాతీయ సమ్మెలకు మద్దతు తెలియజేయడమే కాకుండా, పార్లమెంటరీ కమిటీకి వినతిపత్రం అందజేసినట్లు గుర్తు చేశారు. కేంద్రం తెచ్చిన లేబర్ కోడ్స్ నోటిఫికేషన్లను అమలు చేయకుండా నిలిపివేసిన కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాల నిర్ణయాన్ని ఈ సందర్భంగా ఆయన అభినందించారు. ఈ సదస్సుకు ఐజేయూ అధ్యక్షుడు బల్విందర్ సింగ్ జమ్ము అధ్యక్షత వహించగా, సెక్రటరీ జనరల్ డి. సోమసుందర్ స్వాగతోపన్యాసం చేశారు. కార్యక్రమానికి ముందు ప్రముఖులందరూ జ్యోతి ప్రజ్వలన చేసి సమావేశాన్ని ప్రారంభించగా, హాజరైన ముఖ్య అతిథులను కర్ణాటక స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఐజేయూ మాజీ అధ్యక్షులు ఎస్.ఎన్. సిన్హా, దేవులపల్లి అమర్, సీనియర్ జర్నలిస్ట్ అబ్దుల్ రజాక్, ఐజేయూ స్టీరింగ్ కమిటీ సభ్యుడు ఎం.ఎ. మాజీద్, ఉపాధ్యక్షుడు వై. నరేందర్ రెడ్డి, టియూడబ్ల్యూజే అధ్యక్షుడు కే. విరాహత్ అలీ, ఏపీయూడబ్ల్యూజే అధ్యక్షుడు ఐ.వి. సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి కే. జయరాజ్, జాతీయ కార్యవర్గ సభ్యులు కే. సత్యనారాయణ, కూన అజయ్ బాబు తదితరులు పాల్గొన్నారు. చివరగా కర్ణాటక స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ అధ్యక్షురాలు జానకి మోహన్ ధన్యవాద సమర్పణ చేశారు.






# జర్నలిజం ముసుగులో అధికారికి బెదిరింపులు

**రూ 1.30 లక్షలు వసూలు చేసిన ఇద్దరి రిమాండ్**

**వివరాలు వెల్లడించిన డి.ఎస్.పి**



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** జిల్లా వ్యవసాయ అధికారిని బెదిరించి అక్రమ వసూళ్లకు పాల్పడిన ఇద్దరు సోషల్ మీడియా జర్నలిస్టులను అరెస్ట్ చేసి కోర్టులో రిమాండ్ చేసినట్లు ఆసిఫాబాద్ డీఎస్పీ బి. అశోక్ తెలిపారు. శనివారం ఆసిఫాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన కేసు వివరాలను వెల్లడించారు. పోలీసుల కథనం ప్రకారం.. దహేగం మండలానికి చెందిన బుతే దేవేందర్ , (మెదక్ టుడే), చింతలమానేపల్లి మండలం గంగాపూర్ గ్రామానికి చెందిన దుప్త సురేష్ ( సూరన్న టీవీ) జర్నలిజం ముసుగులో అక్రమ సంపాదనకు అలవాటు పడ్డారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఎల్.బి. నగర్‌లో నివాసముంటున్న వీరిద్దరూ కుమ్మక్కై జిల్లా వ్యవసాయ అధికారి బోర్కుట్ వెంకటి లక్ష్యంగా కుట్ర పన్నారు. రాధిక ట్రేడర్స్ యజమానితో ూా-1 దేవేందర్‌కు ఉన్న వ్యక్తిగత విభేదాల కారణంగా సదరు దుకాణాన్ని మూసివేయించాలని వ్యవసాయ అధికారులపై తీవ్ర ఒత్తిడి తెచ్చారు. అయితే అధికారుల విచారణలో సదరు షాపునకు సంబంధించి లైసెన్సులు, అన్ని రికార్డులు సక్రమంగా ఉన్నట్లు నిర్ధారణ అయింది. దీంతో అధికారులపై కక్ష పెంచుకున్న నిందితులు ఫోన్ కాల్స్, వీడియోలు, సోషల్ మీడియా వేదికగా జిల్లా వ్యవసాయ అధికారిపై ఒత్తిడి తెస్తూ రూ.20 లక్షలు డిమాండ్ చేశారు. వీరి బెదిరింపులు తాళలేక అధికారి జులై 26న నిందితులకు రూ.1.30 లక్షల నగదు చెల్లించారు. అనంతరం బాధితుడు ఆగస్టు 5న ఆసిఫాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా వాట్సాప్ చాట్స్, సోషల్ మీడియా పోస్టులు, స్క్రీన్‌షాట్లు, డిజిటల్ ఆధారాలను సేకరించిన పోలీసులు శుక్రవారం సాయంత్రం హైదరాబాద్‌లో నిందితులిద్దరినీ పట్టుకుని ఆసిఫాబాద్‌కు తరలించారు.కాగా, నిందితుడు ూా-2 దుప్త సురేష్‌పై గతంలో కాగజ్‌నగర్ సబ్ డివిజన్ పరిధిలోని ఒక పోలీస్ స్టేషన్‌లో నమోదైన పోక్సో కేసులో ఒక మైనర్ బాలికకు సంబంధించిన వివరాలు, వీడియోలను సోషల్ మీడియాలో బహిర్గతం చేసినందుకుగాను అతడిపై కేసు నమోదు కాగా, ప్రస్తుతం విచారణలో ఉందన్నారు. జర్నలిజం వృత్తిని అడ్డుపెట్టుకుని ప్రభుత్వ ఉద్యోగులను బెదిరించి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈ విచారణలో ఆసిఫాబాద్ ఇన్స్పెక్టర్ ఎన్. రవి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజా చైతన్య యాత్ర

**సీపీఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కే.సాబీర్ పాషా**

**భద్రాద్రి కొత్తగూడెం,ఆగస్టు8 :** ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజా చైతన్య యాత్ర సాగుతుందని సీపీఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కే.సాబీర్ పాషా తెలిపారు. శనివారం బూర్గంపహాడ్ మండల కేంద్రానికి చేరుకున్న యాత్రలో భాగంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో మాట్లాడుతూ దేశంలో ప్రజా సమస్యలపై చైతన్యం కల్పించి మార్పు తీసుకువచ్చేందుకు కలిసికట్టుగా యాత్రలో అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలన్నారు. ప్రజలను దోచుకునే పాలన మారాలని ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద యువత, విద్యార్థులు చేపట్టిన ఉద్యమమే ప్రజా చైతన్యానికి నిదర్శనమన్నారు. మండలంలో ప్రతి ఏడాది గోదావరి వరదలతో లోతట్టు ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, మండలాన్ని ముంపు నుంచి శాశ్వతంగా రక్షించేందుకు ఎత్తైన ప్రదేశాల్లో పక్కా ఇళ్లు నిర్మించి ఆర్అండ్ఆర్ ప్యాకేజీతో పాటు భూములకు నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పోడు భూముల సమస్యలు పరిష్కరించి గిరిజన ఆదివాసీ రైతులకు హక్కులు కల్పించాలని, పోడు రైతులపై అటవీశాఖ అధికారులు నమోదు చేస్తున్న కేసులను ఉపసంహరించి రక్షణ కల్పించాలన్నారు. ఈ యాత్రలో కొత్తగూడెం మేయర్ మూడ్ గణేలిష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సారెడ్డి పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# 'మూడు ముక్కల' ఆట

**ఏడుగురు జూదరుల ఖేల్ ఖతం!**

**జూద స్థావరాలపై పోలీసుల నిఘా**

**పేకాట ఆడితే కఠిన చర్యలు తప్పవు**

**ఉద్యమ కెరటం, రామగుండం:** అదొక ప్రశాంతమైన పల్లెటూరు... కానీ అక్కడ రాత్రివేళల్లో రహస్యంగా రూ.వేలల్లో చేతులు మారే జూదం ఊపందుకుంటోంది. వ్యాపారులు, డ్రైవర్లు, పెయింటర్లు, ఆఖరికి రిటైర్డ్ సింగరేణి ఉద్యోగి వరకు అందరూ ఒకే చోట చేరి కష్టపడి సంపాదించిన డబ్బును 'మూడు ముక్కల' ఆటలో బలిచేస్తున్నారు. పెద్దంపేట గ్రామంలో కొన్ని రోజులుగా నిశ్శబ్దంగా సాగుతున్న ఈ జూద క్రీడకు రామగుండం టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం రాత్రి చుక్కెదురు చేశారు. పెద్దంపేటలో రహస్యంగా డబ్బులు పందెంగా పెట్టి పేకాట స్థావరం నడుపుతున్నారని రామగుండం పోలీస్ కమిషనర్‌కు నమ్మదగిన సమాచారం అందింది. దీంతో వెంటనే స్పందించిన సీపీ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ శ్రీనివాస్ నేతృత్వంలో, ఎస్ఐ రమేష్ ఆధ్వర్యంలోని నార్కోటిక్/టాస్క్‌ఫోర్స్ బృందం పక్కా వ్యూహంతో ఆ స్థావరాన్ని చుట్టుముట్టి మెరుపు దాడి నిర్వహించింది. పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించిన నిందితులను చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారు. ఈ దాడిలో ఎన్‌టీపీసీకి చెందిన వ్యాపారి ధర్మాజీ లక్ష్మణ్ (53), పెద్దంపేటకు చెందిన డ్రైవర్ లాయిశెట్టి మహేష్ (37), రామగుండం నివాసి, రిటైర్డ్ సింగరేణి ఉద్యోగి బంగారి నారాయణ (55), అంతర్గాంకు చెందిన పెయింటర్ ఆదిచర్ల శివ సాయి (47), పెద్దంపేటకు చెందిన కూలీ మెరుగు వెంకటస్వామి (55), రామగుండంకు చెందిన పెయింటర్ మాచర్ల ఆకాష్ (42), మంథనికి చెందిన కూలీ ఆసర్ల మల్లేష్ (44) పట్టుబడ్డారు. వీరి వద్ద నుంచి రూ.14,730 నగదు, 52 పేకముక్కలు, 6 సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన ఏడుగురు నిందితులను, స్వాధీనం చేసుకున్న సొత్తును తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం అంతర్గాం పోలీస్ స్టేషన్‌కు అప్పగించి కేసు నమోదు చేశారు. డబ్బులు పందెంగా పెట్టి పేకాట ఆడటం లేదా స్థావరాలు నిర్వహించడం చట్టరీత్యా నేరమని, కమిషనరేట్ పరిధిలో ఇలాంటి అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపుతామని టాస్క్‌ఫోర్స్ అధికారులు హెచ్చరించారు.

# ఎల్‌నినోతో సాగునీటికి కష్టాలు

**సాగునీటి సలహామండలి సమావేశంలో కోమటిరెడ్డి**

**నల్గొండ, ఆగస్టు 8:** ఎల్‌నినో కారణంగా ప్రస్తుతం నాగార్జునసాగర్ ప్రాజెక్టులో ఉన్న నీరు తాగునీటికే సరిపోతుందని, అంతేకాక పైనుంచి నీరు వచ్చే అవకాశం కూడా లేనందున రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ వరి వేయకుండా ఆరుతడి పంటలు వేసుకునేలా అధికారులు అవగాహన కల్పించాలని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఒకవేళ నాగార్జునసాగర్ నిండినప్పటికి చెరువులు నింపే పరిస్థితి లేదని, ఇప్పటికే బోర్లలో కూడా గ్రౌండ్ వాటర్ తగ్గిపోతున్నందున కష్టకాలంలో అధికారులు, ప్రజాప్రతినిధులు రైతులకు అండగా నిలబడి ఆరుతడి పంటలు వేసుకునేలా చూడాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. శనివారం నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ.. ప్రస్తుతం నాగార్జునసాగర్ ప్రాజెక్టులో నీరు డెడ్‌స్టోరేజీలో ఉందని, శ్రీశైలం నుంచి నీరు వచ్చినప్పటికీ పంటలకు సాగునీరు ఇచ్చే పరిస్థితి లేదని, ఉన్న నీరు జూన్ 2027 వరకు తాగునీటికే సరిపోతుందని తెలిపారు. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకొని రైతులు ఆరుతడి పంటలు వేసుకోవాలని కోరారు. ఏఎంఆర్‌పీ కూడా సగమే నిండిందని, గతంలో ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి లేదని మంత్రి అన్నారు. కరువు వచ్చినప్పటికీ నల్గొండ జిల్లాకు శాశ్వతంగా సాగునీరు అందించే ఎస్‌ఎల్‌బీసీ సొరంగం పనులు ఆగస్టు 2028 నాటికి పూర్తి చేస్తామని మంత్రి తెలిపారు. ఎస్‌ఎల్‌బీసీ కోసం ఎంతైనా ఖర్చు చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశించారని తెలిపారు. కరువు వచ్చినా, శ్రీశైలం డెడ్‌స్టోరేజీలో ఉన్నప్పటికీ ఎస్‌ఎల్‌బీసీ నుంచి సాగునీరు అందించవచ్చన్నారు. రాబోయే రోజుల్లో సూపర్ ఎల్‌నినో కారణంగా దక్షిణ తెలంగాణలో పరిస్థితులు ఎలా ఉంటాయో తెలియని పరిస్థితి నెలకొందని తెలిపారు. అందువల్ల అధికారులు, ప్రజాప్రతినిధులు రైతులు ఆరుతడి పంటలు వేసుకునేలా కష్టపడి పనిచేయాలని, ఇలాంటి కరువు పరిస్థితుల్లో రైతులకు అందరూ అండగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో పంట మార్పిడిలో భాగంగా 33 వేల ఎకరాల్లో వరికి బదులు ఆరుతడి పంటలు వేయడం జరిగిందని మంత్రి తెలిపారు. అయితే దీన్ని లక్షన్నర ఎకరాల లక్ష్యంగా తీసుకుని రైతులతో ఆరుతడి పంటలు వేయించాలని ఆదేశించారు. జిల్లాలో 9 వేల ట్రాన్స్‌ఫార్మర్లపై ఉన్న ఓవర్‌లోడ్‌ను దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ముఖ్యమంత్రితో మాట్లాడి అవసరమైన విద్యుత్ సామగ్రిని తెప్పిస్తామన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి కష్టకాలంలో రైతులకు అండగా ఉండాలని, ప్రజలకు ధైర్యం చెప్పాలని, ఆరుతడి పంటలు వేసుకునే విధంగా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఇకపై జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశాలను నిరంతరం నిర్వహించాలని సూచించారు. జిల్లాలోని వివిధ ప్రాజెక్టుల కింద రైతులు రెండు పంటలు వరి వేస్తున్నారని, దీనివల్ల భవిష్యత్తులో భూములు సారం కోల్పోయి ఎందుకూ పనికిరాకుండా పోతాయని మంత్రి అన్నారు. విపరీతంగా ఎరువులు వాడటం, నిరంతరం వరి సాగు చేయడం వల్ల భవిష్యత్తులో ఎలాంటి పంటలు వేసుకోలేని పరిస్థితి వస్తుందన్న విషయాన్ని రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఇందులో భాగంగా కూరగాయల పంటలు, ఉద్యాన పంటలు పండించాలని, ఆర్గానిక్ వ్యవసాయం చేసే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాకు 5 వేల యూనిట్ల స్పిం÷-రక్లర్లు కావాలని అధికారులు కోరగా.. తక్షణమే వాటిని మంజూరు చేయించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు.

Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN,** and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. RNI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: **9030717172, 9391127717**

# లంక బౌలర్లపై గుర్నూర్ విధ్వంసం



- బౌలర్ కాదు.. బ్యాట్‌తో 'సిక్సర్ల బ్రార్'!
- ఒకే ఓవర్‌లో నాలుగు భారీ సిక్సర్లు
- 18 బంతుల్లోనే అజేయంగా 36 పరుగులు
- రెండో రోజు ముగిసేసరికి భారత్ 357/6

**కొలంబో:** శ్రీలంక ఎలెవన్‌తో జరుగుతున్న వార్మప్ మ్యాచ్‌లో భారత పేసర్ గుర్నూర్ బ్రార్ బ్యాట్‌తో సంచలనం సృష్టించాడు. ప్రధానంగా బౌలర్‌గా జట్టులో ఉన్న గుర్నూర్.. రెండో రోజు ఆట చివర్లో లంక బౌలర్లపై విరుచుకుపడి సిక్సర్ల వర్షం కురిపించాడు. కేవలం 18 బంతుల్లోనే అజేయంగా 36 పరుగులు చేసి అందరి దృష్టిని ఆకర్షించాడు. రెండో రోజు చివరి ఓవర్‌లో శ్రీలంక స్పిన్నర్ దిలుమ్ సుదీర బౌలింగ్‌కు దిగాడు. తొలి బంతికి దేవదత్ పడిక్కల్ సింగిల్ తీసి గుర్నూర్‌కు స్ట్రైక్ ఇచ్చాడు. ఆ తర్వాత గుర్నూర్ తన బ్యాట్‌కు పనిచెప్పాడు. వరుస బంతుల్లో రెండు భారీ సిక్సర్లు బాది లంక శిబిరాన్ని షాక్‌కు గురిచేశాడు. ఆ తర్వాత పడిక్కల్‌కు సింగిల్ తీసే అవకాశం వచ్చినా గుర్నూర్ తనపై నమ్మకంతో దానిని తిరస్కరించాడు. మిగిలిన రెండు బంతులను కూడా భారీ సిక్సర్లుగా మలిచి ఓవర్‌ను అదిరిపోయే రీతిలో ముగించాడు. దీంతో ఆ ఓవర్‌లో తాను ఎదుర్కొన్న ఐదు బంతుల్లోనే నాలుగు సిక్సర్లు బాది ప్రేక్షకులను అలరించాడు. గుర్నూర్ మెరుపులతో భారత్ భారీ స్కోరు దిశగా దూసుకెళ్లింది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి భారత్ ఆరు వికెట్ల నష్టానికి 357 పరుగులు చేసింది. అంతకుముందు శ్రీలంక క్రికెట్ ఎలెవన్ తొలి ఇన్నింగ్స్‌ను 363 పరుగుల వద్ద ఎనిమిది వికెట్లు కోల్పోయి డిక్లేర్ చేసింది. బంతితో ప్రత్యర్థి బ్యాటర్లను ఇబ్బంది పెట్టాల్సిన గుర్నూర్.. ఈసారి బ్యాట్‌తో లంక బౌలర్లకు చుక్కలు చూపించడం వార్మప్ మ్యాచ్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

# పదేళ్ల తర్వాత మళ్లీ జావెలిన్ మెరుపు

- అండర్-20 ప్రపంచ ఛాంపియన్‌షిప్స్‌లో ఆశిష్ యాదవ్‌కు రజతం
- 74.09 మీటర్ల త్రోతో సీజన్ బెస్ట్ నమోదు
- 2016లో నీరజ్ స్వర్ణం.. ఇప్పుడు ఆశిష్ రజతం
- జావెలిన్‌లో భారత్‌కు రెండో ప్రపంచ అండర్-20 పతకం




**న్యూఢిల్లీ:** భారత జావెలిన్ త్రోలో మరో యువ కెరటం దూసుకొచ్చింది. అండర్-20 ప్రపంచ ఛాంపియన్‌షిప్స్‌లో 19 ఏళ్ల భారత అథ్లెట్ ఆశిష్ యాదవ్ అద్భుత ప్రదర్శనతో రజత పతకాన్ని సొంతం చేసుకున్నాడు. పదేళ్ల క్రితం ఇదే వేదికపై నీరజ్ చోప్రా స్వర్ణంతో చరిత్ర సృష్టించగా.. ఇప్పుడు ఆశిష్ రజతంతో ఆ ఘనతను కొనసాగించాడు. ఫైనల్లో ఆరంభం నుంచే ఆశిష్‌కు గట్టి పోటీ ఎదురైంది. తొలి రౌండ్‌లో 69.96 మీటర్ల దూరం జావెలిన్‌ను విసిరిన అతడు.. మూడో ప్రయత్నంలో మరింత మెరుగైన ప్రదర్శన చేశాడు. ఏకంగా 74.09 మీటర్ల దూరం విసిరి తన సీజన్ అత్యుత్తమ ప్రదర్శనను నమోదు చేశాడు. ఇదే త్రో అతడికి రజత పతకాన్ని ఖాయం చేసింది. దక్షిణాఫ్రికాకు చెందిన జాన్ హైడ్రిక్ హైమన్స్ 80.50 మీటర్ల భారీ త్రోతో స్వర్ణ పతకాన్ని దక్కించుకున్నాడు. డొమినికాకు చెందిన అడ్డిసన్ జేమ్స్ 73.89 మీటర్లతో కాంస్య పతకం సాధించాడు. జేమ్స్‌పై కేవలం 20 సెంటీమీటర్ల ఆధిక్యంతో ఆశిష్ రెండో స్థానాన్ని నిలబెట్టుకోవడం విశేషం.

## నీరజ్ బాటలో ఆశిష్

అండర్-20 ప్రపంచ ఛాంపియన్‌షిప్స్ జావెలిన్ త్రోలో భారత్‌కు ఇది రెండో పతకం. 2016లో పోలాండ్‌లోని బైడ్‌గోస్జ్‌లో జరిగిన ఛాంపియన్‌షిప్స్‌లో నీరజ్ చోప్రా 86.48 మీటర్ల త్రోతో స్వర్ణ పతకం సాధించి ప్రపంచ జూనియర్ రికార్డు నెలకొల్పాడు. అదే ఈవెంట్‌లో భారత్‌కు తొలి పతకం. సరిగ్గా పదేళ్ల తర్వాత ఆశిష్ యాదవ్ రజతంతో మ-రోసారి భారత జావెలిన్ సత్తాను ప్రపంచ వేదికపై చాటాడు. నీరజ్ చోప్రా తర్వాత ఈ విభాగంలో పతకం సాధించిన రెండో భారత అథ్లెట్‌గా ఆశిష్ ప్రత్యేక గుర్తింపు పొందాడు.

# యశస్వితో మృణాల్ ప్రేమాయణం..?

- కేఫ్ వీడియోతో మొదలైన డేటింగ్ ప్రచారం
- నటి పేరుతో వైరల్‌గా మారిన 'రూమర్స్ నమ్మొద్దు' కామెంట్
- ఆ వ్యాఖ్య నిజంగా మృణాల్‌దేనా అన్న సందేహాలు
- ఇద్దరి నుంచి ఇప్పటివరకు అధికారిక స్పందన లేదు






**ముంబై:** బాలీవుడ్ నటి మృణాల్ ఠాకూర్, భారత యువ క్రికెటర్ యశస్వి జైస్వాల్ మధ్య ప్రేమాయణం సాగుతోందంటూ కొద్దిరోజులుగా సామాజిక మాధ్యమాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. తాజాగా మృణాల్ పేరుతో ఓ కామెంట్ వైరల్ కావడంతో ఈ ఊహాగానాలు మరింత పెరిగాయి. అయితే ఆ వ్యాఖ్య నిజంగానే మృణాల్ చేశారా? లేదా? అన్నదానిపై స్పష్టత లేకపోవడంతో ఈ ప్రచారంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కొంతకాలం క్రితం ముంబైలోని ఓ కేఫ్ నుంచి మృణాల్, యశస్వి ఒకే సమయంలో బయటకు వస్తున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. ఇద్దరూ ఒకేసారి బయటకు వచ్చినప్పటికీ అక్కడి నుంచి వేర్వేరుగా వెళ్లిపోయారు. దీనికి సంబంధించిన వీడియోలు, ఫొటోలు వైరల్ కావడంతో ఇద్దరూ డేటింగ్‌లో ఉన్నారంటూ ఊహాగానాలు మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో యశస్వితో తన సంబంధంపై మృణాల్ స్పందించారంటూ ఓ కామెంట్ తెరపైకి వచ్చింది. పుకార్లను నమ్మవద్దని, ఇలాంటి అంశాలపై వీడియోలు చేయడం కంటే సరైన విషయాలపై దృష్టి పెట్టాలంటూ ఆమె వ్యాఖ్యానించినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ప్రస్తుతం వైరల్ అవుతున్న అసలు వీడియో వద్ద ఆ కామెంట్ కనిపించడం లేదు. దీంతో అది నిజంగా మృణాల్ ఖాతా నుంచి వచ్చిన స్పందనేనా? లేక ఎవరైనా సృష్టించినదా? అన్నది నిర్ధారణ కాలేదు. మృణాల్, యశస్వి మధ్య వయసులో దాదాపు పదేళ్ల వ్యత్యాసం ఉంది. మృణాల్ వయసు 34 ఏళ్లు కాగా యశస్వి వయసు 24 ఏళ్లు. గతంలో మృణాల్‌కు నటుడు ధనుష్‌తో సంబంధం ఉందంటూ కూడా ప్రచారం జరిగింది. ఇద్దరూ వివాహం చేసుకోబోతున్నారనే వార్తలు సైతం వెలువడ్డాయి. అయితే అప్పట్లో మృణాల్ సన్నిహిత వర్గాలు ఆ ప్రచారాన్ని ఖండించాయి. ప్రస్తుతం మృణాల్-యశస్వి సంబంధంపై వారిద్దరి నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. కేఫ్‌లో కలిసి కనిపించిన దృశ్యాలు, సామాజిక మాధ్యమాల్లో ప్రచారంలో ఉన్న కామెంట్ మినహా ఇద్దరూ డేటింగ్‌లో ఉన్నారని నిర్ధారించే ఆధారాలు ఇప్పటివరకు బయటకు రాలేదు. అందువల్ల మృణాల్ పేరుతో వైరల్ అవుతున్న కామెంట్‌ను ఆమె అధికారిక స్పందనగా భావించడం తొందరపాటే.



# వరల్డ్‌కప్ స్టార్‌కు గాయం

## ఆసియా కప్‌పై అనుమానం!

### తొడ కండరాల గాయంతో జెమీమా రోడ్రిగ్స్‌కు ఎదురుదెబ్బ

**న్యూఢిల్లీ, ఆగస్టు 8:** ఆసియా కప్ సమీపిస్తున్న వేళ భారత మహిళల క్రికెట్ జట్టుకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. కీలక మిడిలార్డర్ బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్ తొడ కండరాల గాయానికి గురైంది. ఇంగ్లండ్‌లో జరుగుతున్న 'ది హండ్రెడ్' లీగ్‌లో సదరన్ బ్రేవ్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆమె గాయం కారణంగా టోర్నీ నుంచి వైదొలిగింది. దీంతో త్వరలో జరగనున్న మహిళల ఆసియా కప్‌లో జెమీమా ఆడుతుందా? లేదా? అన్న సందేహాలు నెలకొన్నాయి. స్వదేశంలో జరిగిన వన్డే ప్రపంచకప్‌లో కీలక ఇన్నింగ్స్‌లతో ఆకట్టుకున్న జెమీమా.. భారత బ్యాటింగ్ విభాగంలో కీలక ఆటగాడిగా ఎదిగింది. మిడిలార్డర్‌లో పరిస్థితులకు అనుగుణంగా ఇన్నింగ్స్‌ను నిర్మించడంలో ఆమెకు మంచి పేరుంది. అలాంటి కీలక ఆటగాడు ఆసియా కప్‌కు ముందు గాయపడటం భారత జట్టు యాజమాన్యాన్ని ఆందోళనకు గురిచేస్తోంది. ఆసియా క్రికెట్ మండలి ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఆగస్టు 28 నుంచి యూఏఈ వేదికగా మహిళల ఆసియా కప్ ప్రారంభం కానుంది. అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న భారత్--పాకిస్థాన్ మ్యాచ్ సెప్టెంబర్ 5న జరగనుంది. ఈలోగా జెమీమా పూర్తిస్థాయి ఫిట్‌నెస్ సాధిస్తుందా అన్నది కీలకంగా మారింది.

### రూ.76 లక్షలకు కొనుగోలు

జెమీమా రోడ్రిగ్స్‌ను సదరన్ బ్రేవ్ జట్టు సుమారు రూ.76 లక్షలకు దక్కించుకుంది. అంచనాలకు తగ్గట్టుగానే ఆమె 'ది హండ్రెడ్'లో నిలకడగా రాణించింది. ఆరు మ్యాచ్‌ల్లో 143 పరుగులు చేసి ఆకట్టుకుంది. రెండుసార్లు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచింది. సదరన్ బ్రేవ్ పాయింట్ల పట్టికలో రెండో స్థానంలో కొనసాగడంలోనూ ఆమె కీలక పాత్ర పోషించింది. అయితే నాకౌట్ దశకు ముందు తొడ కండరాల గాయం ఆమెను టోర్నీ నుంచి తప్పించింది. జెమీమా స్థానంలో ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ చార్లీ నాట్‌ను సదరన్ బ్రేవ్ జట్టులోకి తీసుకుంది. ప్రస్తుతం జెమీమా గాయం తీవ్రత, కోలుకోవడానికి పట్టే సమయంపైనే భారత జట్టు దృష్టి నిలిచింది. ఆసియా కప్‌కు ఇంకా కొంత సమయం ఉన్నప్పటికీ ఆమె ఫిట్‌నెస్ సాధించకపోతే భారత మిడిలార్డర్‌పై ప్రభావం పడే అవకాశముంది.





# వైభవ్‌లో అసలు ప్రత్యేకత అదే!

### 15 ఏళ్లకే అతడి ధైర్యం అద్భుతం: శిఖర్ ధావన్

### ఫోర్లు, సిక్సర్లు బాదే తీరు ఆకట్టుకుంటోంది

### నైపుణ్యానికి తోడు మానసిక స్థైర్యమే అతడి బలం

### వైభవ్ భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని ప్రశంస

**న్యూఢిల్లీ:** భారత యువ సంచలనం వైభవ్ సూర్యవంశీపై మాజీ క్రికెటర్ శిఖర్ ధావన్ ప్రశంసల వర్షం కురిపించాడు. చిన్న వయసులోనే అత్యున్నత స్థాయిలో ఒత్తిడిని తట్టుకుంటూ దూకుడుగా బ్యాటింగ్ చేయడం వైభవ్‌లోని ప్రత్యేకతని పేర్కొన్నాడు. అతడి ప్రతిభతో పాటు భారీ షాట్లు ఆడేందుకు చూపుతున్న ధైర్యం తనను ఎంతగానో ఆకట్టుకుందని తెలిపాడు. "వైభవ్ అద్భుతంగా బ్యాటింగ్ చేస్తున్నాడు. 15 ఏళ్ల వయ-సులోనే అత్యున్నత స్థాయిలో రాణించడం గొప్ప విషయం. ఐపీఎల్‌లోనూ అతడి ఆట ఆకట్టుకుంటోంది. ముఖ్యంగా ఫోర్లు, సిక్సర్లు కొట్టే విధానం చాలా బాగుంది. ఇంత చిన్న వయసులో అలాంటి షాట్లు ఆడేందుకు అవసరమైన ధైర్యం, మానసిక స్థైర్యం ఉండటం సాధారణ విషయం కాదు" అని ధావన్ ప్రశంసించాడు. కేవలం సాంకేతిక నైపుణ్యం మాత్రమే కాకుండా ప్రత్యర్థి బౌలర్లపై ఎదురుదాడికి దిగే మనస్తత్వం వైభవ్‌కు అదనపు బలమని పేర్కొన్నాడు. చిన్న వయసులోనే ఒత్తిడికి భయపడకుండా తన సహజమైన ఆటను కొనసాగించడం అతడి కెరీర్‌కు ఎంతో ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డాడు. "వైభవ్ సూర్యవంశీ భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని నేను నమ్ముతున్నాను" అంటూ ధావన్ యువ బ్యాటర్‌పై విశ్వాసం వ్యక్తం చేశాడు.

ఉద్యమ కెరటం
UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక
ఆదివారం
9 ఆగస్టు 2026




# 12న ఇరుముడి ట్రైలర్ విడుదలకు సన్నాహాలు

మాస్ మహారాజా రవితేజ కథానాయకుడిగా తెరకెక్కుతున్న తాజా చిత్రం 'ఇరుముడి' ట్రైలర్‌ను ఆగస్టు 12న విడుదల చేయనున్నారు. భీమవరంలోని ఓ ప్రైవేట్ కాలేజీలో ఈ ట్రైలర్ లాంచ్ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. 'నిన్ను కోరి', 'టక్ జగదీష్' వంటి చిత్రాలతో తనదైన గుర్తింపు తెచ్చుకున్న శివ నిర్వాణ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంపై ఇప్పటికే ప్రేక్షకుల్లో మంచి ఆసక్తి నెలకొంది. ఇప్పటివరకు సినిమాకు సంబంధించి విడుదలైన పోస్టర్లు, గ్లింప్స్, ఇతర ప్రచార చిత్రాలు ప్రేక్షకుల నుంచి పాజిటివ్ రెస్పాన్స్‌ను అందుకున్నాయి. ముఖ్యంగా కుటుంబ కథాంశానికి భక్తి అంశాలను జోడించి సినిమాను రూపొందిస్తున్నట్లు తెలుస్తుండటంతో 'ఇరుముడి'పై అంచనాలు మరింత పెరిగాయి. ట్రైలర్ విడుదల కార్యక్రమానికి చిత్ర బృందంతో పాటు అభిమానులు, సినీ ప్రేక్షకులు భారీగా హాజరయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే 'ఇరుముడి' నుంచి వచ్చిన ప్రమోషనల్ కంటెంట్ సినిమాపై పాజిటివ్ వైబ్స్‌ను తీసుకొచ్చింది. దీంతో ట్రైలర్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. కుటుంబ భావోద్వేగాలు, భక్తి అంశాలతో పాటు రవితేజకు సంబంధించిన మాస్ ఎలివేషన్స్‌ను ట్రైలర్‌లో ఎలా చూపించారనేది ఆసక్తికరంగా మారింది. ట్రైలర్ కూడా ప్రేక్షకులను మెప్పిస్తే సినిమా విడుదలకు ముందే హైప్ మరింత పెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా రవితేజను శివ నిర్వాణ ఏ తరహా పాత్రలో చూపించారనే విషయం ట్రైలర్ ద్వారా స్పష్టత వచ్చే అవకాశం ఉందని అభిమానులు భావిస్తున్నారు. ఈ సినిమాలో రవితేజ సరసన ప్రియా భవానీ శంకర్ కథానాయికగా నటిస్తున్నారు. రవితేజ కుమార్తె పాత్రలో బేబీ నక్షత్ర కనిపించనుంది. కుటుంబ బంధాలు, భావోద్వేగాలకు ప్రాధాన్యత ఉన్న కథలో ఈ తండ్రీకూతుళ్ల బంధం కీలకంగా ఉండబోతున్నట్లు తెలుస్తోంది. మాస్ మహారాజా ఇమేజ్‌కు భిన్నంగా కుటుంబ భావోద్వేగాలను, భక్తి అంశాలను కలగలిపి శివ నిర్వాణ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లు సమాచారం. దీంతో 'ఇరుముడి' రవితేజ కెరీర్‌లో మరో విభిన్నమైన సినిమాగా నిలుస్తుందా అన్న ఆసక్తి నెలకొంది. కాగా 'ఇరుముడి' ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

# రామాయణ తొలుత విదేశాల్లో విడుదల




రామాయణం ఇతిహాసం ఆధారంగా తెరకెక్కుతోన్న ప్రతిష్టాత్మక చిత్రం 'రామాయణ' ప్రపంచవ్యాప్త విడుదలపై నిర్మాత నమిత్ మల్హోత్రా కీలక ప్రకటన చేశారు. ఈ సినిమాను అంతర్జాతీయ మార్కెట్‌లో ముందుగా.. ఆ తర్వాత భారత్‌లో విడుదల చేసేలా వినూత్న వ్యూహాన్ని అనుసరిస్తున్నట్లు వెల్లడించారు. తాజాగా ఓ ఆంగ్ల మీడియాతో ఆయన మాట్లాడారు. నవంబర్ 6న విదేశాల్లో 'రామాయణ' విడుదల చేస్తున్నాం. విదేశీ మార్కెట్లలో సినిమాల విడుదల సాధారణంగా శుక్రవారం నుంచే ప్రారంభమవుతుంది. ఇండియాలో మాత్రం దీపావళి నవంబర్ 8 రోజే విడుదల చేస్తాం అని చెప్పారు. దిగ్గజ దర్శకుడు నితీశ్ తివారీ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ భారీ బ్జడెట్ దృశ్యకావ్యంలో శ్రీరాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతగా సాయి పల్లవి, రావణాసురుడిగా యష్, హనుమంతుడిగా సన్నీ దేవోల్, లక్ష్మణుడిగా రవి దూబే నటిస్తున్నారు. ఆస్కార్ విజేతలు ఏ.ఆర్. రెహమాన్, హన్స్ జిమ్మర్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ఇండియాలో ధర్మ ప్రొడక్షన్స్ ఈ చిత్రాన్ని పంపిణీ చేస్తుండగా, ఓవర్సీస్ హక్కులను సోనీ పిక్చర్స్ దక్కించుకుంది. సంగీత హక్కులను టీ-సిరీస్ రూ. 75 కోట్లకు సొంతం చేసుకున్నట్లు సమాచారం.


# త్రివిక్రమ్‌తో మా బంధం బలమైనది

## సూర్యదేవర నాగవంశీ వెల్లడి

ఒక బ్యానర్‌లో పనిచేసే వ్యక్తుల మధ్య మంచి అనుబంధం ఏర్పడితే.. అదే బంధం కొనసాగుతుందని, దానికి ప్రత్యేకమైన అగ్రిమెంట్లు అవసరం లేదని ఆయన పేర్కొన్నారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న నాగవంశీ.. నిర్మాతల కాంపౌండ్స్, దర్శకుడు త్రివిక్రమ్‌తో తమ కుటుంబానికి ఉన్న అనుబంధం గురించి ఆసక్తికర విషయాలను వెల్లడించారు. డైరెక్టర్ త్రివిక్రమ్ శ్రీనివాస్‌తో వారి కుటుంబానికి ఉన్న అనుబంధం గురించి నాగవంశీ మాట్లాడుతూ.. తన బాబాయి (చిన్నబాబు) ఇండస్ట్రీలోకి రావాలని అనుకున్న సమయంలో తొలి సినిమాను త్రివిక్రమ్ దర్శకత్వంలోనే చేయాలని కోరుకున్నారని తెలిపారు. త్రివిక్రమ్ పనితీరు, సినిమాలపై ఆయనకు ఉన్న అభిమానం కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. ఆ సమయంలో 'జులాయి' సినిమా ప్రారంభమైనప్పటి నుంచి త్రివిక్రమ్‌తో తమ అనుబంధం మరింత బలపడిందని నాగవంశీ పేర్కొన్నారు. 'హారిక అండ్ హాసిని క్రియేషన్స్' అనే బ్యానర్ పేరును కూడా త్రివిక్రమే సూచించారని, ఆ బ్యానర్ లోగోను సైతం ఆయనే డిజైన్ చేశారని వెల్లడించారు. 'అప్పటి నుంచి ఇప్పటివరకు త్రివిక్రమ్ బయట బ్యానర్‌లో సినిమా చేయలేదు. దీనికి ఎలాంటి అగ్రిమెంట్లు లేవు. మా మధ్య ఉన్న రిలేషన్‌షిప్ అలాంటిది. ఒక ఫ్యామిలీలా అయిపోయాం' అని నాగవంశీ చెప్పుకొచ్చారు. త్రివిక్రమ్ తమ బ్యానర్‌తోనే వరుసగా సినిమాలు చేస్తూ ప్రయాణం కొనసాగిస్తున్న నేపథ్యంలో.. తమ వైపు నుంచి కూడా ఆయనకు ఎక్స్‌క్లూజివిటీ ఇవ్వడం సహజమేనని నాగవంశీ అన్నారు. 'హారిక అండ్ హాసిని క్రియేషన్స్' బ్యానర్‌ను ప్రధానంగా త్రివిక్రమ్ సినిమాల కోసం కొనసాగిస్తున్నట్లు వివరించారు. అయితే త్రివిక్రమ్‌కు ఆ బ్యానర్‌లో వాటా ఉందనే ప్రచారంపై కూడా నాగవంశీ క్లారిటీ ఇచ్చారు. హారిక అండ్ హాసిని క్రియేషన్స్‌లో త్రివిక్రమ్‌కు ఎలాంటి షేర్ లేదని, ఆయనకు రెమ్యునరేషన్ మాత్రమే ఉంటుందని స్పష్టం చేశారు. ఆయనకు సంబంధించిన షేర్ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్‌లో ఉంటుందని తెలిపారు. అలాగే సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్‌కు సంబంధించిన ప్రాజెక్టుల్లో త్రివిక్రమ్ కీలకంగా భాగస్వామ్యం అవుతున్నారని, స్క్రిప్టులు, ఇతర సినిమా విషయాల్లో ఆయన సలహాలు కూడా తీసుకుంటామని నాగవంశీ వెల్లడించారు. త్రివిక్రమ్‌తో తమ బంధం కేవలం సినిమాలకు సంబంధించినది మాత్రమే కాదని.. సంవత్సరాలుగా కొనసాగుతున్న అనుబంధమే తమ ప్రయాణానికి కారణమని నాగవంశీ చెప్పుకొచ్చారు.



# 1 బిలియన్ కలెక్షన్ల క్లబ్‌లో ది ఒడిస్సీ




హాలీవుడ్ ప్రముఖ దర్శకుడు క్రిస్టోఫర్ నోలన్ తెరకెక్కించిన తాజా విజువల్ వండర్ 'ది ఒడిస్సీ' బాక్సాఫీస్ వద్ద సరికొత్త చరిత్ర సృష్టిస్తోంది. థియేటర్లలో విడుదలైన మూడు వారాల్లోనే ఈ ఫాంటసీ యాక్షన్ డ్రామా ప్రపంచవ్యాప్తంగా 1 బిలియన్ కలెక్షన్ల క్లబ్‌లో (దాదాపు రూ.9,500 కోట్లకు పైగా) అడుగుపెట్టింది క్రిస్టోఫర్ నోలన్ కెరీర్‌లో 1 బిలియన్ మార్కును అందుకున్న మూడో చిత్రంగా 'ది ఒడిస్సీ' నిలిచింది. అంతకుముందు ఆయన దర్శకత్వం వహించిన 'ది డార్క్ నైట్' (1.008 బిలియన్), 'ది డార్క్ నైట్ రైజెస్' (1.08 బిలియన్) ఈ ఘనత సాధించాయి. గతేడాది వచ్చిన 'ఓపెన్‌హైమర్' ఈ మార్కుకు కాస్త దూరంలో ఆగిపోయింది. కాగా, ఈ వీకెండ్ ముగిసేసరికి 'ది ఒడిస్సీ' నోలన్ కెరీర్‌లోనే అత్యధిక కలెక్షన్లు సాధించిన చిత్రంగా నిలవడం ఖాయమని విశ్లేషకులు భావిస్తున్నారు. ఒక్క ఐమాక్స్ స్క్రీన్ల నుంచే ఏకంగా 257 మిలియన్ డాలర్ల వసూళ్లు (దాదాపు రూ.2,445 కోట్లు) రావడం విశేషం. త్వరలోనే ఐమాక్స్ చరిత్రలోనే అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగానూ ఇది నిలవనుంది. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద మార్కెట్ అయిన చైనాలో ఈ సినిమా విడుదల కావాల్సి ఉంది. చైనా వ్యాప్తంగా దాదాపు 800 ఐమాక్స్ స్క్రీన్లతో పాటు వేలాది సాధారణ స్క్రీన్లలో అత్యంత భారీ స్థాయిలో విడుదల చేయడానికి మేకర్స్ ఎ÷-లాన్ చేస్తున్నారు. దీంతో ఈ సినిమా మరిన్ని రికార్డులను తిరగరాయడం ఖాయంగా కనిపిస్తోంది.

# కొరియన్ కనకరాజుతో హిట్ కొట్టిన వరుణ్ తేజ్




మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్‌కు గత కొంతకాలంగా హిట్ కోసం ఎదురుచూస్తున్నారు. తాజాగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'కొరియన్ కనకరాజు' వరుణ్ తేజ్‌కు భారీ ఊరటనిచ్చేలా బాక్సాఫీస్ వద్ద దూసుకెళ్తోంది. మేర్లపాక గాంధీ దర్శకత్వం వహించిన ఈ హారర్ కామెడీ చిత్రంలో వరుణ్ తేజ్ సరసన రితిక నాయక్ హీరోయిన్‌గా నటించింది. సత్య కీలక పాత్రలో కనిపించారు. విడుదలకు ముందు నుంచే మంచి బజ్‌ను సొంతం చేసుకుంది. తాజా సమాచారం ప్రకారం 'కొరియన్ కనకరాజు' ప్రీమియర్స్, తొలి రోజు కలిపి రూ.10.2 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసినట్లు చిత్ర బృందం ప్రకటించింది. హారర్ కామెడీ జోనర్‌లో తెరకెక్కిన సినిమాకు ఇది మంచి ఓపెనింగ్‌గా చెప్పొచ్చు. అంతేకాదు.. వరుణ్ తేజ్ కెరీర్‌లో ఇదే బిగ్గెస్ట్ ఓపెనర్గా నిలిచినట్లు మేకర్స్ వెల్లడించారు. గతంలో వరుణ్ తేజ్‌కు అత్యధిక ఓపెనింగ్ అందించిన 'గద్దలకొండ గణెళిష్' సినిమాను 'కొరియన్ కనకరాజు' అధిగమించింది. దీంతో చాలా కాలం తర్వాత వరుణ్ తేజ్ అభిమానుల్లో కొత్త ఉత్సాహం కనిపిస్తోంది. దేశీయ మార్కెట్‌తో పాటు ఓవర్సీస్‌లోనూ సినిమా మంచి ఆరంభాన్ని అందుకుంది. ముఖ్యంగా అమెరికాలో ఇప్పటివరకు 1.75 లక్షల డాలర్ల గ్రాస్ సాధించినట్లు సమాచారం. సినిమా థియేట్రికల్ రైట్స్‌కు అనుగుణంగా చూస్తే ఇదే ట్రెండ్‌ను కొనసాగిస్తే బ్రేక్ ఈవెన్ దిశగా వెళ్లే అవకాశాలు ఉన్నాయని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. విడుదలకు ముందే అడ్వాన్స్ బుకింగ్స్‌లో కూడా 'కొరియన్ కనకరాజు' మంచి జోరు చూపించింది. బుక్‌మైషో, డిస్ట్రిక్ట్ యాప్‌లలో కలిపి 2.5 లక్షలకు పైగా టికెట్లు అమ్ముడైనట్లు చిత్ర బృందం వెల్లడించింది. తొలి రోజు వసూళ్లతో పాటు సినిమాకు వస్తున్న మౌత్ టాక్ కూడా పాజిటివ్‌గా ఉండటం మేకర్స్‌కు మరింత కలిసొచ్చే అంశంగా మారింది.

Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN,** and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. RNI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: **9030717172, 9391127717**




# నవ్వుల పూలంగి హాస్య చక్రవర్తి రేలంగి

### నేడు హాస్య చక్రవర్తి రేలంగి జయంతి

కమెడియన్‌గా, విలన్‌గా, క్యారెక్టర్ నటుడిగా, తన ప్రతిభను అన్ని కోణాల్లో ఆవిష్కరించిన హాస్య చక్రవర్తి రేలంగి. తెలుగు సినీ హాస్యనటుల్లో తొలి పద్మశ్రీ పురస్కారం అందుకున్న కామెడీ కింగ్. తెలుగు సినీ హాస్య సామ్రాజ్యాన్ని దాదాపు రెండు దశాబ్దాలు ఏకఛత్రాధిపత్యంగా ఏలిన హాస్యపు రారాజు రేలంగి. తెలుగు ప్రజల ఆదరాన్ని చూరగొన్నారు. 'మా రేలంగోడు' అని అభిమానంగా పిలిపించు కున్నారు. చెప్పులు లేకుండా నడచిన పాండీ బజారులో ఏనుగు అంబారీమీద ఊరేగాడు. పుట్టి పెరిగిన నేలమీద ఆయన గజారోహణం చేయించు కున్నారు. అసాధ్యాలను సాధ్యాలుగా మలుచు కున్నారు. అగ్రశ్రేణి హీరో రామారావు చేత బావా' ' అని ప్రేమతో, ఆదరంగా పిలిపించు కున్నారు. నటీనటుల చేత, జర్నలిస్టుల చేత సత్కారాలు పొందారు. దేశాధ్యక్షుని చేతిమీదుగా పద్మశ్రీ పురస్కారం అందుకొని తొలి హాస్య నటుడిగా చరిత్ర పుటల కెక్కారు... పుట్టిన నేల తల్లిని మరవకుండా చివరి దశలో అక్కడే తనువు చాలించారు. అంతటి గొప్ప పాత తరం నటుడైన రేలంగి వెంకట రామయ్య (9 ఆగస్టు 1910 – 26 నవంబర్ 1975) జయంతి సందర్భంగా ఆయన జీవన ప్రస్థానంలో ప్రత్యేకతల గురించి తెలిపే చిరు ప్రయత్నం ఇది. రేలంగి వెంకట్రామయ్య తూర్పు గోదావరి జిల్లా, కాకినాడ సమీపంలోని రావులపాడులో 1910, ఆగష్టు 9వ తేదీన జన్మించారు. తొలి రోజుల్లో తనపాటలు తనే పాడుకునేవారు. 'పాతాళభైరవి'లో 'వినవే బాలా నా ప్రేమ గోలా', 'తాళలేనే నే తాళలేనే అమ్మలారా ఓయమ్మలారా', పాటలు; విప్రనారాయణ సినిమాలో 'ఆడది అంటే లయం లయం ఆ నీడంటేనే భయం భయం' పాట; మిస్సమ్మ సినిమాలో 'ధర్మం చెయ్ బాబూ కాణీ ధర్మం చెయ్ బాబూ', ' సీతారాం సీతారాం, సీతారాం జై సీతారాం'; ఎత్తుకు పైఎత్తు చిత్రంలో 'ఎవడను కున్నావు' పాటలు వాటిలో కొన్ని మాత్రమే. సినిమాలన్నిటిలోనూ వైవిధ్యమైన పాత్రలు పోషిస్తూ, పాత్రోచితంగా సంభాషణలు నొక్కి వక్కాణించడం హాస్యనటుడిగా ఒక్క రేలంగికే సాధ్యమైంది. అందుకే హీరోతో సమాన ప్రాధాన్యంగా ఉండేలా రచయితలు రేలంగి పాత్రలను తీర్చిదిద్దారు. ఒక హీరో మరియు హీరోయిన్‌కు లభించే జీతం వలె రేలంగి వెంకట రామయ్యకు భారీ మొత్తాన్ని అందించారు. జెమినీ వారు నిర్మించిన 'బాలనాగమ్మ' (1942) చిత్రంలో తలారి రాముడు పాత్ర పోషించిన రేలంగి మళ్ళీ పదిహేడు సంవత్సరాల తరువాత శ్రీవేంకటరామణా వారు నిర్మించిన 'బాలనాగమ్మ' (1959) చిత్రంలో అదే పాత్రను పోషించడం విశేషం. అలాగే 'గొల్లభామ' (1947) చిత్రంలో ధరించిన విదూషకుడి పాత్రనే ఇరవై ఏళ్ల తరవాత 'భామా విజయం' (1967) చిత్రంలో తిరిగి పోషించారు.

రేలంగి పోషించిన ఏ పాత్రైనా కథలో ప్రధాన భాగంగా ఉండేదే కానీ, అతికించినట్లు వుండేది కాదు. 'చెంచులక్ష్మి' చిత్రంలో నారదునిగా 'నీలగగన ఘన శ్యామా దేవా' అనే హరినామ కీర్తన చేస్తూ నటిస్తుంటే ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. రేలంగి కోసం 'సరదా సరదా సిగిరెట్టు ఇది దొరల్ తాగు బల్ సిగిరెట్టు' (సిరి సంపదలు), 'అయ్యయ్యో చేతిలో డబ్బులు పోయెనే' (కులగోత్రాలు), 'హరి గోవింద గోవింద' (వెలుగు నీడలు), 'ఇంగ్లీషులోన మ్యారేజి' (ఆరాధన), 'గనగజా తనయం సహృదయం' (వాగ్దానం), 'చెక్కిలి మీద చెయ్యి జేర్చి చిన్నదానా' (మాంగల్య బలం), 'ఆ దేవుడు మనిషిగ పుట్టాలిరా' (అంతస్తులు), 'నీసోకు చూడకుండ నవనీతమ్మో' (తోడి కోడళ్ళు), 'భలేచాన్సులే బలే చాన్సులే' (ఇల్లరికం) వంటి ఎన్నో సరదా పాటలు ఆరోజుల్లో సినిమాల్లో పెడితే ప్రేక్షకులు ఎంతబాగా ఆదరించారో చెప్పాల్సిన పనే లేదు. రేలంగి నటించిన చివరి సినిమా ఎన్టీఆర్ నటించిన 'నిప్పులాంటి మనిషి. 1970లో భారత ప్రభుత్వం రేలంగికి 'పద్మశ్రీ' అవార్డు ఇచ్చి సత్కరించింది. పద్మ పురస్కారం అందుకున్న తొలి హాస్య నటుడు రేలంగి కావడం విశేషం. శ్రీవేంకటేశ్వర విశ్వ విద్యాలయానికి రేలంగి సెనేట్ సభ్యుడుగా వ్యవహరించారు. ఆంధ్రనాటక కళాపరిషత్తు, హైదరాబాదు వారు 1955లో రేలంగికి ఘనసత్కారం చేశారు. తనవద్ద పనిచేసిన డ్రైవరుకు వృద్ధాప్యం వలన కళ్లు కనుపించక పోతే, అతనికి ఒక ఇల్లు కట్టించి నెలనెలా పింఛను వచ్చేలా కొంత పెద్ద మొత్తాన్ని బ్యాంకులో వేసి ఆదుకున్న మానవతా మూర్తి ఆయన. రేలంగి వృద్ధిలోకి వచ్చాక కష్టాలను, కష్టాలలో ఆదుకున్న మిత్రులను మరచిపోలేదు. తను తిండితిప్పలు లేకుండా అవస్థపడిన వాడు కనుక, తను భోజనం చేసేటప్పుడు కనీసం పాతిక మందికి భోజనం పెట్టే సదాచారాన్ని పాటించారు. నాటి అగ్ర కథా నాయకులు రామారావు, నాగేశ్వరరావు కన్నా ముందే చిత్రసీమలో అడుగు పెట్టినవాడు కావడంతో ఇద్దరూ రేలంగిని ఎంతగానో గౌరవించేవారు. వరవిక్రయం' సినిమాలో భానుమతి నటించడానికి కారకులు రేలంగి. అలాగే అంజలీదేవి 'గొల్లభామ'లో నటించడానికి ఆమెను పుల్లయ్యకు పరిచయం చేసిన వ్యక్తి రేలంగి. రేలంగి కాస్టింగ్ ఏజంటుగా పనిచేస్తుండడంతో కృష్ణవేణి, పుష్పవల్లి, హైమవతి, భానుమతి, అంజలీదేవి వంటి నటీమణుల్ని సినిమాల్లో పరిచయం చేసే గొప్ప అవకాశం రేలంగికి దక్కింది. 1910లో జన్మించి, 65 వ ఏట 1975 సంవత్సరంలో మరణించిన రేలంగి తెలుగు సినిమా మనగలిగినంత కాలం హృదయాలలో చిరస్థాయిగా నిలిచి పోతారు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# వరుణ యాగం... వర్షాభిలాషకు వైదిక సంకల్పం

### ఆధ్యాత్మిక సంకల్పం... ఆయకట్టు సుభిక్షం

### జల సిరుల కోసం వరుణ యాగం

వాన చినుకు కోసం నేల ఆత్రుతగా ఎదురు చూస్తోంది. ఆశల పల్లకి మోసుకొచ్చే నల్లని మబ్బుల కోసం రైతు కళ్లు ఆకాశాన్ని తిలకిస్తున్నాయి. పల్లెల్లో చెరువులు, కుంటలు, వాగులు, వంకలు జలకళ కోసం నిరీక్షిస్తున్నాయి. విత్తిన విత్తనం మొలకెత్తి పంట పొలాలు పచ్చదనం పరుచుకోవాలని, బావుల్లో జలమట్టాలు పెరగాలని, జలాశయాలు నిండుకుండల్లా తొణికిసలాడాలని తెలంగాణ గ్రామీణ సీమ కోరుకుంటోంది. వాతావరణంలో చోటుచేసుకుంటున్న పరిణామాలు, రుతుపవనాల గమనంలో మార్పులతో కొన్ని ప్రాంతాల్లో వర్షాల కోసం ఎదురుచూపులు కొనసాగుతున్న వేళ.. రాష్ట్రంలో సమృద్ధిగా వానలు కురిసి, నదులు పరవళ్లు తొక్కి, జలాశయాలు నిండి, రైతాంగం సుభిక్షంగా ఉండాలన్న ఆకాంక్షతో తెలంగాణ ప్రభుత్వం 'మహా వరుణ యాగం' నిర్వహించేందుకు సిద్ధమైంది. ఆగస్టు 10న నాగార్జునసాగర్‌లోని విజయ విహార్ ప్రాంగణంలో ఈ వైదిక క్రతువు జరగనుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచనల మేరకు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సారథ్యంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి చెందిన వేద పండితులు, అర్చకులు, రుత్వికులు శాస్త్రోక్తంగా యాగాన్ని నిర్వహించనున్నారు.



### సాగర్ తీరమే యాగ వేదిక

మహా వరుణ యాగానికి నాగార్జునసాగర్‌ను వేదికగా ఎంచుకోవడం ప్రత్యేకతను సంతరించుకుంది. కృష్ణానదిపై నిర్మించిన నాగార్జునసాగర్ ప్రాజెక్టు తెలుగు రాష్ట్రాల్లోని విస్తారమైన ఆయకట్టుకు దశాబ్దాలుగా జీవనాడిగా నిలుస్తోంది. వ్యవసాయం, తాగునీరు, విద్యుదుత్పత్తి అవసరాల్లో ఈ ప్రాజెక్టుకు అత్యంత కీలక స్థానం ఉంది. సాగర్ జలాలతో ఆయకట్టు కళకళలాడితే రైతుల్లో ధైర్యం పెరుగుతుంది. పంట పొలాలకు జీవం వస్తుంది. వ్యవసాయాధారిత గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో చైతన్యం నెలకొంటుంది. అందుకే మహా జలాశయం తీరాన వరుణ యాగం నిర్వహించడాన్ని కేవలం ఆధ్యాత్మిక ప్రార్థనగానే కాకుండా.. నీటి ప్రాధాన్యాన్ని, రైతు ఆకాంక్షలను ప్రతిబింబించే సందర్భంగానూ చూడవచ్చు. యాగం కోసం విజయ విహార్ ప్రాంగణంలో వైదిక నియమాలకు అనుగుణంగా 11 హోమకుండాలను ఏర్పాటు చేస్తున్నారు. 108 మంది వేద పండితులు, అర్చకులు, రుత్వికులు మంత్రోచ్చారణల మధ్య క్రతువును నిర్వహించనున్నారు. సప్తశతి, రుద్ర, పవమాన, వరుణ సూక్తాలతో ప్రత్యేక పూజలు జరగనున్నాయి. యాదాద్రి దేవస్థాన ఆస్థాన సిద్ధాంతి నిర్ణయించిన ముహూర్తం మేరకు ఆగస్టు 10న మధ్యాహ్నం 3.20 గంటల నుంచి 3.24 గంటల మధ్య మహా పూర్ణాహుతి నిర్వహించనున్నట్లు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు, ప్రజాప్రతినిధులు పాల్గొననున్నారు. కృష్ణా, గోదావరి నదులు జలకళ సంతరించుకోవాలని, చెరువులు, ప్రాజెక్టులు నిండాలని, రైతాంగం సుభిక్షంగా ఉండాలని సంకల్పం చేయనున్నారు.

### యాగంతోనే కాదు.. జల సంరక్షణతోనూ

తెలంగాణలోని వేలాది చిన్న, మధ్యతరహా చెరువులను సంరక్షించడం, కాలువలను ఆధునికీకరించడం, వర్షపు నీటిని భూమిలోకి ఇంకించే నిర్మాణాలను పెంచడం, నీటిని పొదుపుగా వినియోగించే సూక్ష్మ సేద్య పద్ధతులను ప్రోత్సహించడం దీర్ఘకాలిక నీటి భద్రతకు అత్యవసరం. వర్షపాతం అనేది రుతుపవనాల కదలికలు, అల్పపీడనాలు, ఉపరితల ఆవర్తనాలు, సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు, ఎల్‌నినో–లానినా వంటి అనేక వాతావరణ అంశాలపై ఆధారపడే సంక్లిష్టమైన ప్రకృతి ప్రక్రియ. అందువల్ల వరుణ యాగాన్ని వాతావరణ శాస్త్రానికి ప్రత్యామ్నాయంగా కాకుండా.. ప్రకృతి పట్ల మానవ సమాజం వ్యక్తం చేసే సామూహిక ఆకాంక్ష, ఆధ్యాత్మిక విశ్వాసానికి ప్రతీకగా చూడాలి. ఆధ్యాత్మిక విశ్వాసంతో పాటు శాస్త్రీయ జల నిర్వహణ, పర్యావరణ పరిరక్షణ, అడవుల పెంపకం, వర్షపు నీటి సంరక్షణను సమన్వయం చేసుకున్నప్పుడే నీటి సమస్యలకు దీర్ఘకాలిక పరిష్కారం సాధ్యమవుతుంది.

### మంత్రఘోష.. రైతు గుండెల్లో వాన ఆశ

ఒకవైపు సాగర్ తీరాన వేద పండితుల మంత్రఘోషలు మార్మోగుతుంటే.. మరోవైపు పొలంలో వేసిన విత్తనం కోసం రైతు ఆకాశం వైపు ఆశగా చూస్తున్నాడు. రెండింటి ఆకాంక్ష ఒక్కటే. మబ్బులు కమ్మాలి.. వాన కురవాలి.. ఎండిన నేల తడవాలి.. పంటలు పండాలి.. రైతు ఇంట సంతోషం వెల్లివిరియాలి. సాగర్ తీరాన నిర్వహించే మహా వరుణ యాగం ఒక వైదిక క్రతువుగానే మిగిలిపోకుండా.. వర్షం, నేల, నీరు, రైతు జీవితం పరస్పరం ఎంత బలంగా ముడిపడి ఉన్నాయో గుర్తుచేసే సందర్భంగా మారాలి. యాగంలో వ్యక్తమయ్యే జలసంకల్పం.. ప్రతి వాన చినుకునూ ఒడిసిపట్టే ప్రజా కార్యాచరణగా రూపాంతరం చెందినప్పుడే ఆ ప్రార్థన మరింత సార్థకమవుతుంది. అదే పచ్చని తెలంగాణకు నిజమైన సువర్ణ బాట.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# సకల పాప హారిణి.. కామిక ఏకాదశి

### శ్రీహరి ఆరాధనకు పరమ పవిత్రమైన పర్వదినం

### తులసీ దళ పూజతో అనంత పుణ్యఫలమని పురాణోక్తి

### ఉపవాసం.. జాగరణతో మోక్షప్రాప్తి కలుగుతుందని విశ్వాసం

### కోరికలు సిద్ధింపజేసే ఏకాదశిగా ప్రత్యేక ప్రాశస్త్యం



ఆషాఢ మాసంలో కృష్ణపక్ష ఏకాదశిని 'కామిక ఏకాదశి'గా జరుపుకుంటారు. అత్యంత పవిత్రమైన, పుణ్యప్రదమైన ఏకాదశుల్లో దీనికి విశిష్ట స్థానం ఉంది. పేరుకు తగినట్లుగానే మనసులోని ధర్మబద్ధమైన కోరికలను నెరవేర్చే శక్తి ఈ ఏకాదశికి ఉ ందని భక్తుల విశ్వాసం. శ్రీమహావిష్ణువును భక్తిశ్రద్ధలతో ఆరాధించడం, ఉపవాసం పాటించడం, తులసీ దళాలతో పూజించడం ఈ పర్వదినంలో ప్రధానమైన ఆచారాలుగా పురాణాలు పేర్కొంటున్నాయి. శ్రీమహావిష్ణువు యోగనిద్రలో ఉండే చాతుర్మాస కాలంలో వచ్చే తొలి కృష్ణపక్ష ఏకాదశి కావడంతో కామిక ఏకాదశికి మరింత ప్రాధాన్యం ఏర్పడింది. ఈ రోజున శ్రీహరిని ఆరాధించడం, తులసీ దళాలతో అర్చించడం, దీపారాధన చేయడం, దానధర్మాలు ఆచరించడం విశేష ఫలితాలను ఇస్తాయని ఆధ్యాత్మిక గ్రంథాలు చెబుతున్నాయి.

### కాశీ స్నానాన్ని మించిన పుణ్యమని విశ్వాసం

కామిక ఏకాదశి రోజున శ్రీహరిని భక్తితో ఆరాధించడం ద్వారా అపారమైన పుణ్యఫలం లభిస్తుందని పురాణ కథనాలు పేర్కొంటున్నాయి. కాశీలో గంగాస్నానం, కేదారనాథుని దర్శనం, సూర్యగ్రహణ సమయంలో కురుక్షేత్రంలో పుణ్యస్నానం, భూదానం వంటి మహా పుణ్యకార్యాలతో సమానమైన లేదా అంతకంటే విశేషమైన ఫలం కామిక ఏకాదశి వ్రతంతో లభిస్తుందని విశ్వసిస్తారు.

### శ్రీకృష్ణుడు చెప్పిన ఏకాదశి మహిమ

పురాణ కథనం ప్రకారం ధర్మరాజు యుధిష్ఠిరుడు ఆషాఢ కృష్ణపక్షంలో వచ్చే ఏకాదశి మహిమను వివరించాలని శ్రీకృష్ణుడిని కోరాడు. అప్పుడు శ్రీకృష్ణుడు కామిక ఏకాదశి విశిష్టతను వివరిస్తూ బ్రహ్మదేవుడు నారద మహర్షికి తెలిపిన విషయాలను ధర్మరాజుకు వివరించినట్లు చెబుతారు. నారదుడు తన తండ్రి బ్రహ్మదేవుడిని ఆషాఢ కృష్ణపక్ష ఏకాదశి విశిష్టత గురించి అడగగా.. దీనినే కామిక ఏకాదశి అంటారని, దీని మహిమను విన్నంత మాత్రాన కూడా పుణ్యం లభిస్తుందని బ్రహ్మ వివరించినట్లు పురాణ కథనం. శంఖచక్రగదాధరుడైన శ్రీమహావిష్ణువును శ్రీధరుడు, హరి, విష్ణువు, మాధవుడు, మధుసూదనుడు తదితర నామాలతో ఈ రోజున భక్తిశ్రద్ధలతో ఆరాధించాలని పేర్కొంటారు.

### తులసీ దళానికి అపారమైన ప్రాధాన్యం

కామిక ఏకాదశి ఆరాధనలో తులసికి అత్యంత ప్రాధాన్యం ఉంది. ఒక్క తులసీ దళంతో శ్రీమహావిష్ణువును భక్తితో పూజించినా విశేషమైన పుణ్యం లభిస్తుందని పురాణాలు పేర్కొంటున్నాయి. బంగారం, వెండి, రత్నాలను సమర్పించి చేసే పూజకంటే తులసీ దళంతో చేసే అర్చన శ్రీహరికి అత్యంత ప్రీతికరమని విశ్వాసం. తామరాకుపై నీటిబొట్టు అంటనట్లే కామిక ఏకాదశి రోజున తులసీ దళాలతో విష్ణువును ఆరాధించిన వారికి పాపాలు అంటవని పురాణోక్తి. తులసి మొక్కను పూజించి, నెయ్యి దీపం వెలిగించడం కూడా అత్యంత పుణ్యప్రదమని చెబుతారు. లేత తులసీ దళాలతో శ్రీహరిని అర్చించడం గత జన్మల పాపాలను సైతం హరిస్తుందని భక్తుల విశ్వాసం.

### ఉపవాసం.. జాగరణకు విశిష్ట ఫలం

కామిక ఏకాదశి రోజున ఉపవాసం పాటిస్తూ శ్రీహరి నామస్మరణ చేయడం అత్యంత పుణ్యప్రదమని చెబుతారు. రాత్రివేళ భగవన్నామ స్మరణతో జాగరణ చేయడం ద్వారా ఆధ్యాత్మిక ఫలం సిద్ధిస్తుందని పురాణాలు పేర్కొంటున్నాయి. ఏకాదశి వ్రతాన్ని సంపూర్ణ భక్తితో ఆచరించిన వారికి మోక్షమార్గం సుగమమవుతుందని విశ్వాసం. ఈ రోజున గోదానం చేయడం, అన్నదానం, వస్త్రదానం వంటి దానధర్మాలు చేయడం కూడా విశేష ఫలితాలను ఇస్తాయని చెబుతారు. పాప పరిహారం కోరుకునేవారు భక్తిశ్రద్ధలతో ఏకాదశి వ్రతాన్ని ఆచరించాలని పురాణ కథనాలు వివరిస్తున్నాయి.

### దీపారాధనతో శ్రీహరి అనుగ్రహం

కామిక ఏకాదశి రోజున శ్రీకృష్ణుడిని లేదా శ్రీమహావిష్ణువును నిష్ఠగా పూజించి నువ్వుల నూనె లేదా నెయ్యితో దీపం వెలిగించడం శుభప్రదమని పండితులు చెబుతున్నారు. సూర్యోదయానికి ముందే నిద్రలేచి శుచిగా స్నానమాచరించి, శ్రీహరి పూజ, తులసీ పూజ, నామస్మరణ చేయడం సంప్రదాయంగా వస్తోంది. కామిక ఏకాదశి వ్రతం పాప విమోచనానికి అత్యంత శక్తిమంతమైనదని పురాణాలు వర్ణిస్తున్నాయి. బ్రహ్మహత్య వంటి మహాపాతకాల నుంచి కూడా విముక్తిని ప్రసాదించే శక్తి ఈ ఏకాదశికి ఉందని పౌరాణిక కథనాల్లో ప్రస్తావన ఉంది. భక్తి, నియమం, ఉ పవాసం, తులసీ పూజ, దీపారాధన, దానధర్మాలతో కామిక ఏకాదశిని ఆచరించడం ద్వారా శ్రీహరి అనుగ్రహం లభిస్తుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. అందుకే ఆషాఢ కృష్ణపక్షంలో వచ్చే ఈ పవిత్ర తిథిని లిలి'సకల పాప హారిణి.. కామిక ఏకాదశి'లిలిగా భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో ఆచరిస్తారు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494